


కడియపులంక రామాలయం వీధిలో రూపాయి కాసులతో గణపతి

గణపయ్యా..దీవించయ్యా..!

» జిల్లా వ్యాప్తంగా 5 వేల విగ్రహాలు ఏర్పాటు
» వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్యలు
» ఘనంగా గణపతి నవరాత్రులు ప్రారంభం


రాజమండ్రిలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమ య్యాయి.ఊరూ వాడా గణపతి నవరాత్రి మండపాలు వెలిశాయి. అడుగు విగ్రహం నుంచీ 15 అడుగుల భారీ గణపయ్య విగ్రహాలు ఆ పందిళ్లలో కొలువుదీరాయి. ఎవరి ఉత్సుకతను బట్టి వారు ఏకదంతుడి విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల సామూ హికంగా పూజలు చేశారు. రూపాయి కాసులు, సిరి ధ్యాన్యాలు, నూలు దారం పోగులు..ఇలా వివిధ రూపాల్లో లంబోదరుడు కనువిందు చేస్తు న్నాడు. నవరా త్రుల అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేయకుండా ప్రసాదం రూపంలో భక్తులకు వితరణ చేసే విధంగా పలు రకాల పదా ర్థాలు/వస్తువులతో కొన్ని చోట్ల గణపతి విగ్రహాలను తయారు చేశా రు.జిల్లావ్యాప్తంగా చిన్నాపెద్దా కలిపి 5 వేల వరకూ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆయా ఉత్సవ కమిటీల నిర్వహణలో నవరాత్రులు కొనసాగు తున్నాయి.ఈ ఏడాది కూటమి ప్రభుత్వం గణపతి నవరాత్రి మండపాలకు తొమ్మిది రోజుల పాటు ఉచితంగా కరెంటు సదుపాయం కల్పించడంతో మండప నిర్వాహకులు, భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది.కరెంటు ఉచితం కావ డంతో మరింత ఎక్కువ సంఖ్యలో విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. దీంతో గణపయ్య వేడుకల శోభ రెట్టింపయ్యింది.ఇంటింటా పాలవెల్లిని అలంకరించి గణపతిని భక్తి శ్రద్ధలతో పూజించారు. ఉండ్రాళ్లు, కుడుములు, గారెలు, పరమాన్నం తదితర పిండివంటలతో బొజ్జ నిండా నైవేద్యాలు సమర్పించారు. శమంతకోపాఖ్యానం విన్నారు. పూజ అనంతరం తమపై నీలాప నిందలు పడకూడదని లంబోదరుడిని వేడుకొంటూ, తమ కార్యాల్లో విఘ్నాలు తొలగాలని ఆశీర్వదించాలని విఘ్నాధి పతి ని కోరుకుంటూ అక్షతలు తలపై చల్లుకున్నారు. ఈసారి మట్టి గణపతి ప్రతిమలు ఎక్కువగా దర్శనమిచ్చాయి. పర్యావరణ హితులు మట్టి ప్రతిమలకే పూజలు నిర్వహించారు. వినాయక దేవాలయాలు బుధవారం కిటకిటలాడాయి. చెవిలో విన్నవిస్తే కోర్కెలు తీర్చే బిక్కవోలు లక్ష్మీ గణపతి ఆలయంలో భక్తుల కోలాహలం కనిపించింది. ఉదయం ఇంట్లో పూజ చేసుకొని సాయంత్రం దేవా లయాలకు, అలా విహారానికి వెళ్లే వాళ్లను వర్షం నిరాశ పరిచింది. వర్షం ఓ మోస్తరుగా కురుస్తుండడంతో చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తుతో పాటు నిఘా ఏర్పాటు చేశారు. అవసరమైన చోట్ల డ్రోన్లతో పహరా కాస్తు న్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది ఒక్కొక్కరికి ఇన్ని మండపాలు/పందిళ్లు అంటూ బాధ్యత అప్పగించారు. అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు నిర్వహించినా సహిం చేది లేదని హెచ్చరించారు. ఉత్సవ కమిటీలే ఉత్సవానికి సంబంధించి పూర్తి బాధ్యత వహించాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఇప్పటికే స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో ఆయా మండపాల వద్ద ఉండేవాళ్ల జాబితాలను కూడా పోలీసుల తీసుకున్నారు. మరోవైపు నిమజ్జనాలు మొదలైపోయాయి. అధిక శాతం నవరాత్రుల అనం తరం నిజమజ్జనం చేసినా, కొందరు 1, 3, 5 రోజుల్లో కూడా ఈ కార్యక్రమం పూర్తి చేస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తెలిపారు.


రాజమండ్రి రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన రూపాయి కాసుల గణపతి


తొలిరోజు బుధవారమే పూజ ముగించి రాజమండ్రి గోదావరి గట్టు వద్ద గుట్టగా పోసిన పూజాసామగ్రి

నోటీసులిచ్చినా.. పింఛన్లు ఇస్తాం

అర్హత నోటీస్ అప్పీల్‌పై నిర్ణయం వచ్చే వరకూ ఎవరికీ ఆపరు : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అనర్హుల పేరిట నోటీసులు అందుకున్న వారికి యథావిధిగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పింఛన్లు రద్దవుతాయనే ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వారి పరిస్థితిని అర్థం చేసుకుని అప్పీల్ నిర్ణయం తేలే వరకూ పింఛన్లు అందజేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 32 వేల మంది దివ్యాంగులు ఉండగా సుమారు 3211 మందికి అనర్హత నోటీసులు జారీ చేశారు. కోరుకొండ మండలం కోటి గ్రామంలో 600 పింఛన్లు ఉంటే సుమారు 260 వరకూ అనర్హులు ఉన్నట్టు ప్రచారం ఉంది. ఇదిలా ఉండగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి నుంచి గురువారం జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ అనర్హత నోటీసు అందుకున్నవారు ఎంపీడీవో కార్యాలయాల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు.ఇప్పటికే అప్పీల్ చేసుకున్న వారికి తుది నిర్ణయం వచ్చే వరకూ పింఛన్లు యథావిధిగా అందుతాయన్నారు. తాత్కాలిక దివ్యాంగ సర్టిఫికెట్లు ఉన్నవారికి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. నోటీసు అందుకుని ఇప్పటి వరకూ అప్పీలు చేయని వారు ఎంపీడీలకు అప్పీల్ చేసుకోవాలని సూచించారు.

భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలు

జిల్లాలో భూగర్భజలాల పునరుద్ధరణకు సైకప్పు వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రీచార్జి పిట్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేయాలని, పీఎం కుసుమ్ పథకంలో 10 మెగావాట్ల సామర్థ్యంగల సౌర విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన భూమిని గుర్తించాల న్నారు.కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ, డ్వామా పీడీ నాగ మల్లే శ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీఆర్‌డీఏ పీడీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చవితి రోజంతా కురిసింది వాన

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరుగా వర్షం పడింది. బుధవారం రాత్రంతా వాన కురిసింది.గురువారం ఉదయం తెరపి చ్చింది. మళ్లీ రాత్రి వాన జోరు మొదలైంది. గత 24 గంటల్లో జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు ప్రకటిం చారు. రాజమండ్రి అర్బన్‌లో అత్యధికంగా 61.2 మిల్లీ మీటర్లు, గోపాలపురంలో 60. 6 మి.మీ, రాజమండ్రి రూరల్‌లో 54.2 ,పెరవలిలో 43.6, నల్లజర్లలో 42, తాళ్లపూ డిలో 37.2, నిడదవోలులో 36 మి.మీ వర్షపాతం నమోదైంది. గోకవరంలో తక్కువగా 8.88, కొవ్వూరు 9.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 553 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదై నట్టు అధికారులు అంచనా వేశారు. గురువారం రాత్రి 8గంటల తర్వాత రాజమండ్రిలో భారీ వాన కురిసింది. జిల్లాలో పలు చోట్ల అధికంగాగానే వర్షం పడినట్టు చెబుతున్నారు.పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.గోదావరి వరద కూడ పెరుగుతోంది.

బస్..రష్!





స్త్రీ శక్తి చూపుతున్న మహిళలు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి - మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణ పథకం అమల్లో తూర్పుగోదావరి జిల్లా రికార్డులు సృష్టిస్తోంది. కేవలం పది రోజుల్లోనే 6.5 లక్షల మంది స్త్రీలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగించారు. తద్వారా రూ.2 కోట్ల 25 లక్షలకు పైగా ఆర్థిక ప్రయోజనం పొందారు. ఈ నెల 25వ తేదీ సోమవారం ఒక్కరోజే రూ.25 లక్షల 16 వేలు లబ్ధిపొందడం గమనార్హం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 15వ తేదీన ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించినా 16వ తేదీ నుంచి మహిళల రద్దీ పెరిగింది. అప్పటి నుంచి నేటి వరకూ రోజు రోజుకూ మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మొన్న ఆదివారం ఒక్కరోజే లక్ష మంది రాకపోకలు సాగిస్తే, సోమవారం లక్షా 20 వేల మంది ప్రయాణించారు.పది రోజుల్లో బస్సుల్లో ఆక్యుపెన్సీ 65 శాతానికి చేరుకుందని, మహిళల ఓఆర్ 54 శాతానికి పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

దూరప్రాంతాల జర్నీ ఇలా..

విశాఖపట్నం, విజయవాడ వెళ్లాలంటే అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ సర్వీసుల్లో స్త్రీలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అనుమతించరు దీంతో ఉచిత ప్రయాణానికి కొత్త మార్గాలను అనుసరిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. విజయవాడ వెళ్లేవాళ్లు ఏలూరు వరకూ ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించి అక్కడి నుంచి విజయవాడ వెళ్లిపోతున్నారు. విశాఖపట్నం వెళ్లే వాళ్లు కూడా తుని వరకూ ఫ్రీ బస్సెక్కి అక్కడి నుంచి అనకాపల్లి వెళుతున్నారు. అనకాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లడానికి చాలా ఫ్రీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. రాజమహేంద్రవరం - తుని రూటులో రద్దీ బాగా పెరగడంతో అదనంగా రెండు బస్సులు పెంచారు. ప్రస్తుతం ఈ రూటులో రాజమహేంద్రవరం డిపోకు చెందిన 16 బస్సులు, తుని డిపో బస్సులు 14 బస్సులు తిరుగుతున్నాయి. అదేవిధంగా రాజమహేంద్రవరం - కాకినాడ వయా బిక్కవోలు, రాజానగరం ఈ రెండు రూట్లలోనూ రష్ పెరిగింది. ఈ కారణంగా రాజమహేంద్రవరం-కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసుల్లో ప్రయాణీకుల సంఖ్య తగ్గినట్టు కనిపిస్తోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

» హ్యాప్రీగా సాగిపోతున్న ప్రయాణం
» 6.5 లక్షల మంది ఉచిత ప్రయాణం
» పెరిగిన మహిళల ఆక్యుపెన్సీ
» రూ.2 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం
» తుని, కాకినాడ రూట్లలో పెరిగిన రద్దీ
» అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు
» విజయవాడ,విశాఖకు బ్రేక్ జర్నీ
» కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులు ఖాళీ

హ్యాపీగా ఫీలవుతున్నారు

ఉచిత బస్సు పథకాన్ని మహిళలు హ్యాపీగా భావిస్తున్నారు.పథకం ప్రారంభమైన 15వ తేదీ నుంచి ఇప్పటి వరకూ బస్సుల్లో మొత్తం 12 లక్షల మందికి పైగా ప్రయాణీకులు రాకపోకలు సాగించగా వీరిలో 6 లక్షల 50 వేల మంది వరకూ మహిళలే. కేవలం పది రోజుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్ల ఆక్యుపెన్సీ 54 శాతానికి పెరిగింది. భద్రాచలం, వాడపల్లి రూట్లలోనూ ఉచిత ప్రయాణం ఇచ్చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టీసీ దగ్గర ఉన్న బస్సులన్నీ ఆన్ రోడ్ చేశాం.

- వైఎస్ఎన్ మూర్తి, ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి



కండక్టర్ నోట కొత్త మాట

దివాన్‌చెరువు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : టిక్కెట్.. టిక్కెట్.. అందరూ టిక్కెట్లు తీసుకున్నారా... అనే మాటలు ఆర్టీసీ బస్సుల్లో సాధారణంగా కండక్టర్‌ల నోట నిన్న మొన్నటి వరకూ సాధారణంగా వినిపిస్తూ ఉండేవి.అయితే గత కొద్ది రోజులుగా దీనికి తోడు అమ్మా ఆధార్.. ఆధార్.. ఆధార్ కార్డు ఉందా అనేమాటలు వినిపిస్తున్నాయి.గతంలో కూడా సీనియర్ సిటిజన్లకు రాయితీ కోసం ఆధార్ కార్డు అడిగినప్పటికీ అది ఆయా బస్సుల్లో కొద్ది మంది ప్రయాణీకులకే పరిమితం అయ్యేది. అయితే ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకం క్రింద పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు,సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి అవకాశం కల్పించింది. మన రాష్ట్రంలో నివసిస్తున్న మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు వర్తిస్తుంది. ఈవిధంగా ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకునేందుకు మహిళా ప్రయాణీకులు ఏదో ఒక గుర్తింపుకార్డు చూపించాల్సి ఉంటుంది. అయితే మహిళలంతా ఆధార్‌కార్డు చూపిస్తున్నారు.. కండక్టర్లు టిక్కెట్లు ఇస్తున్నారు. వాటిపై సంబంధిత ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడవరకూ ప్రయాణిస్తున్నారో చూపి వారు చెల్లించే టిక్కెట్ సొమ్ము వద్ద సున్నా ఫేర్ చూపుతున్నారు. ఉచిత ప్రయాణం చేసే మహిళల్లో ఎక్కువ మంది ఆధార్ కార్డులు పైనే తమప్రయాణాలు సాగిస్తుండడంతో కండక్టర్లు బస్‌లలో టిక్కెట్ ఇచ్చేందుకు వీటిని అడుగుతున్నారు. దీనితో కొంతమంది మహిళలు ఆనందంగా తమ ఆధార్ కార్డులు చూపుతూ స్త్రీశక్తి అని చలోక్తులు విసురుతున్నారు.అలాగే గతంలో బస్సులలో కొన్ని సీట్లు మాత్రమే మహిళలకు కేటాయించేవారు.ఈ ఉచితప్రయాణసౌకర్యం వచ్చాక మహిళాప్రయాణీకులు రద్దీ బస్సులలో పెరగడంతో బస్సుల్లో ఎక్కువ సీట్లులో వారే కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక టిక్కెట్లకు సొమ్ము చెల్లించిన పురుషప్రయాణీకులు నిల్చుని ప్రయాణాలు చేస్తున్నారు.

పెరుగుతున్న గోదారి

చేబ్రోలులో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
అర్ధరాత్రి వరకూ సాగదీత 7

అంగన్‌వాడీల ఆందోళన విరమణ



కొవ్వూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు ఆన్‌లైన్ వర్కుకి హాజరవుతున్నట్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.మాణిక్యాంబ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్లు ఆగస్టు 4వ తేదీన ఐసీడీఎస్ పీవోలకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు ఇచ్చేసి ఆన్‌లైన్ వర్క్‌ని నిలుపుదల చేశారు.ఇదిలా ఉండగా రాష్ట్ర అధికారులతో యూనియన్ నాయకుల సమావేశమయ్యారు. సమస్యలు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో బుధవారం నుంచి ఫోన్‌లు తీసుకుని ఆన్‌లైన్ వర్కుకి హాజరవుతున్నారు. రాష్ట్రంలో 4687 మినీవర్కర్స్‌ని మెయిన్ సెంటర్లకు మార్చి వారికి రూ. 11,500ల వేతనం ఇవ్వడానికి, మినీ సెంటర్‌లలో క్రొత్తగా హెల్పర్స్‌ని నియమించడానికి, అంగన్వాడీలకు పెన్షన్ పంపిణీ నిలుపుదల చేస్తూ సర్క్యులర్ ఇచ్చారన్నారు. గ్రాట్యూటీ జీవో మార్పుచేయాలనే ప్రతిపాదనకు 1972 గ్రాట్యుటీ అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. హెల్పర్స్ ప్రమోషన్స్‌కి సంబంధించి వారంలో గైడ్‌లైన్స్ అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. నెల రోజుల్లో 5జి కొత్త ఫోన్లు అందజేస్తామన్నారు. అంగన్వాడీలకు వేతనాల పెంపుదల, సంక్షేమ పథకాలు అమలు వంటి ప్రభుత్వ హామీలను అమలు చేయకుంటే మరో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎం.సుందరబాబు, ఎస్.శాంత కుమారి,బి.శ్రీదేవి, బి.రమాదేవి, సిహెచ్‌వి బ్రహ్మమ్మ, సీతారత్నం, చైతన్య, గనెమ్మ పాల్గొన్నారు.

మెత్ డ్రగ్ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన బొమ్మూరు పోలీసులు.. మెత్ డ్రగ్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజులపాటి అంకారావు తెలిపిన వివరాల ప్రకారం.. హుకుంపేట జంక్షను సమీపంలోని కుంభకోణం కాఫీ షాపు సమీపంలో నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నారనే సమాచారం వచ్చింది. ఎస్ఐ అంకారావు తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. హుకుంపేటకు చెందిన అమన్ పాండే, విశాఖపట్నానికి చెందిన మండపాటి తేజశ్వి వర్మను అదుపులోకి తీసుకున్నారు. వాళ్ల వద్ద ఉన్న రూ.90 వేలు విలువ చేసే 18గ్రాముల మెత్ డ్రగ్ (క్రిస్టల్ పౌడర్ రూపంలో ఉన్న నిషేధిత మత్తు మందు), రూ.1.07 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

కిక్కిరిసిన అయినవిల్లి





అయినవిల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయంలో వినాయకచవితి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొలిపూజలు అందుకునే దైవం, విఘ్నాలు తొలగించే స్వామి, బుద్ధి-సిద్ధులను ప్రసాదించే, ప్రమద గణాధిపతి పర్వదినమైన శ్రీవినాయక చవితి సందర్భంగా అయినవిల్లి శ్రీసిద్ధివినాయక ఆలయానికి భక్తులు పోటెత్తారు. చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం ఉదయం 3.45 నుంచి స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శైవాగమ మోక్త ప్రకారంగా ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామివారికి వివిధ రకాల పండ్ల రసాలతో శ్రీరుద్రాభిషేకం, లక్ష దుర్వార్చన, గణపతి కల్పము, శ్రీలక్ష్మీ గణపతి హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు వినాయక వ్రతకథ చదివి కథాక్షితలను భక్తులకు బహూకరించారు. స్వామివారికి ప్రత్యేకాలంకరణలు చేసి పంచ హారతులిచ్చారు. సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. అయినవిల్లి సిద్ధివినాయకున్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆలయ ఈవో అల్లు దుర్గాభవానీ స్వామివారి చిత్రపటాన్ని అందించారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జేసీ టి.నిషాంతి, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్, అమరావతి హైకోర్టు న్యాయమూర్తి ఎ.హరనాథశర్మ సిద్ధివినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అయినవిల్లి సిద్ధివినాయకునికి అభిషేకం చేస్తున్న దృశ్యం



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు, ప్రత్యేక పుష్పాలంకరణ



కిటకిటలాడిన బిక్కవోలు

బిక్కవోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : బిక్కవోలు భక్తజనంతో కిటకిటలాడింది. వినాయక చవితి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో క్యూలైన్లు కిక్కిరిశాయి. చెవిలో చెబితే కోర్కెలు నెరవేర్చే బిక్కవోలులోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో బుధవారం ఉదయం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు కలశస్థాపన చేసి ఉత్సవాలు ప్రారంభించారు. అంతకు ముందు తెల్లవారుజామున తీర్థపుబిందె సేవ అనంతరం భక్తులకు స్వామి దర్శనాలు కల్పించారు. స్వామి దర్శనానికి 50 వేల మంది భక్తులు వచ్చారని ఉత్సవకమిటీ అధ్యక్షుడు చాగంటి సాయిబాబారెడ్డి తెలిపారు. తాపేశ్వరం సురుచి ఫుడ్స్ వారు 50 కిలోలు, జి.మామిడాడకు చెందిన రామకృష్ణారెడ్డి 30 కిలోల లడ్డూను స్వామి బహూకరించారు. బిక్కవోలు ఎస్ఐ వి. రవిచంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బహురూపుడు.. గణనాథుడు!



లక్ష్మీగణపతి స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ దిగుమర్తివారి వీధిలో లక్షా యాభై వేల గాజులతో తీర్చిదిద్దిన గణనాథుడు చవితి వేళ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. బుధవారం, గురువారం వేలాదిగా భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



పిఠాపురం మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో కొబ్బరితాళ్లతో ఏర్పాటు చేసిన గణనాథుడు

రాజమండ్రి పుష్కరఘాట్ వద్ద నూలు దారాలతో తయారు చేయించిన 18 అడుగుల గణపతి విగ్రహం ఆకర్షణగా ఉంది.





పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో శివలింగాకారంలో ఏర్పాటు చేసిన లడ్డూ



పెద్దాపురం మండలం కాండ్రకోటలో ఏర్పాటు చేసిన 21 అడుగుల భారీ మట్టి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న నిర్వాహకులు



రాజమహేంద్రవరం లక్ష్మీవారపుపేటలో సిరిధాన్యాలతో గణపతి..



పెరవలి మండలం ముక్కామలలో గణపతిని బుధవారమే నిమజ్జనానికి తరలించారు.. ఉదయం విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం నుంచి ఊరేగింపు ఆరంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడికి ఉంచి ఊరేగించారు. గ్రామస్తులు స్వామి వెంట నడిచారు. బైబై గణేశా అంటూ వీడ్కోలు పలికారు.

వైభవంగా రథోత్సవం

- ఘనంగా శ్రీపాదవల్లభుని జయంతి
- ముగిసిన సప్తాహ మహోత్సవాలు







ప్రత్యేక అలంకరణలో శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతులు, శ్రీపాదశ్రీవల్లభుని రథోత్సవంలో పాల్గొన్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ఈవో సౌజన్య, పాల్గొన్న భక్తులు

పిఠాపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీపాద వల్లభుని జన్మస్థానంగా దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన పిఠాపురం పట్టణంలోని శ్రీపాద శ్రీవల్లభ మహాసంస్థానంలో శ్రీపాదశ్రీవల్లభుల జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీపాదశ్రీ వల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను పుష్పాలు, మారేడు దళాలతో విశేషంగా అలంకరించారు. మారేడుదళాలతో ప్రత్యేక పూజలు, పూలంగి సేవ, అభిషేకాలు జరిగాయి. మహాగణపతి పూజ, స్వామి దివ్యపాద పద్ములకు మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, సర్వపుష్ప పూజ, శ్రీసూక్త, పురుష సూక్తములతో సహస్ర నామార్చన, మంగళహారతి, వేద పారాయణ, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానం, గురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణం జరిగాయి. సాయంత్రం అగ్ని ప్రతిష్టాపన, దత్తమంత్ర హోమం, సాయంకాల అర్చన నిర్వహించారు. హోమానికి పూర్ణాహుతి జరిగింది. రాత్రి శ్రీపాదశ్రీవల్లభుల రథోత్సవాన్ని నిర్వహించారు. రథోత్సవాన్ని పిఠాపురం నియోజకవర్గ జనసేనపార్టీ పిఠాపుర నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించి పాల్గొన్నారు. రథోత్సవంతోపాటు పూజాది కార్యక్రమాల్లో మహారాష్ట్ర, గోవా, కర్నాటక, ఉభయ తెలుగురాష్ట్రాలు నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు. రథోత్సవంలో భాగంగా మహారాష్ట్ర భక్తుల నృత్యాలు, మిరువిట్లు గొలిపే బాణాసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు మహాన్నదానప్రసాద వితరణ జరిగింది. వారంరోజుల పాటు జరిగిన జయంతి ఉత్సవాలు ముగిశాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లూరి సూరిబాబు

- సెప్టెంబరు 5న బాధ్యత స్వీకరణ



సీఎం చంద్రబాబుతో వల్లూరి

సామర్లకోట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు జిల్లాలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సుదీర్ఘకాలంగా అప్‌లాండ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న వల్లూరి సూరిబాబు గత పది నెలలుగా రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శిగానూ వ్యవహరిస్తున్నారు. బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వగృహంలో జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులలో కీలకమైన కొందరు ప్రతినిధులు ఎమ్మెల్యే చినరాజప్పతో సమావేశమయ్యారు. సదరు సమావేశంలో వల్లూరి సూరిబాబును అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు స్పష్టం చేశారు. వల్లూరి సూరిబాబును మెజార్టీ రైస్‌మిల్లర్లు ప్రతిపాదించడంతో ఎమ్మెల్యే చినరాజప్ప సంతృప్తి వ్యక్తం చేశారు. సెప్టెంబరు 5న కాకినాడలోజిల్లా అసోసియేషన్ కార్యాలయంలో భారీఎత్తున జరుపనున్న కార్యక్రమంలో వల్లూరి సూరిబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 115 రైస్‌మిల్లర్లు సెప్టెంబరు 5న నూతన అధ్యక్షుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

మెరుగైన సమాజం నిర్మాణంలో యువత పాత్ర కీలకం

- జేఎన్టీయూకే ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్
- పీఆర్‌లో విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాకినాడ జేఎన్టీయూ వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్

కాకినాడరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మెరుగైన సమాజం నిర్మాణం, క్రియాత్మక ప్రజాస్వామ్యాన్ని నిర్మించడంలో యువత పాత్ర కీలకమని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అన్నారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో మెరుగైన సమాజం కోసం పనిచేస్తున్న పౌరసంఘాలు, యూనివర్శిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్, జన విజ్ఞాన వేదిక విద్యార్థులకు ప్రజాస్వామ్యంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించినట్లు కళాశాల ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ హరిరామ్‌ప్రసాద్ తెలిపారు. కాకినాడ జేఎన్టీయూ ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువ ఓటర్ల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయ శాస్త్రం విద్యార్థులకు సమాజం, ప్రజాస్వామ్యంలో ప్రస్తుత సవాళ్లను ప్రతిబింబించే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వం, లఘుచిత్రం విభాగాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మన ప్రజాస్వామ్యంలో ఉన్న ప్రస్తుత సవాళ్లను ప్రతిబింబించేలా కళాకారులు బుర్రకథను ప్రదర్శించారు. కార్యక్రమంలో యూనివర్శిటీ ఆఫ్ డెమోక్రసీ ఫౌండేషన్ ఛైర్మన్ జి.అబ్బయ్య, కార్యదర్శి ఆలపాటి శ్రీనివాస్, మెంటార్ కృష్ణమోహన్, ప్రసాద్, డాక్టర్ ఖలీఫా బాషా,సయ్యద్ సలార్, హరికిషన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సంస్కృతి మనుగడకు.. భాషే ప్రధానం

- భావవ్యక్తీకరణకు మాతృభాషే ఆధారం
- నేడు తెలుగు భాషా దినోత్సవం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మన తల్లిదండ్రులంత గొప్పది మన తెలుగు తల్లి భాష. ఆభాషను గౌరవించుకోవడం, కాపాడుకోవడం ప్రతిఒక్కరి బాధ్యత. తెలుగు భాషకు తిక్కన నుంచి ఎర్రాప్రగడ వరకు-తెలుగు వాగ్గేయకారులు, కవులు మనకు అమూల్యమైన సాహిత్యాన్ని అందించారు. అన్నమయ్య, త్యాగరాజు, గురజాడ, శ్రీశ్రీవంటి మహనీయులు తెలుగుభాషను సాహిత్యం, గీతం, నాటకం ద్వారా అమరంగా నిలిపారు. ఆగస్టు 29న ప్రతిఏటా తెలుగుభాషా దినోత్సవం జరుపుకుంటాం. ఇది గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా జరుపుకోవడం ప్రత్యేకత. ఆయన భాషా ఉద్యమం ద్వారా తెలుగుభాషను సాధారణ ప్రజలకు చేరవేశారు. తెలుగు సాహిత్యాన్ని కాపాడుకునేందుకు జిల్లాలో కొన్ని సంస్థలు ఇప్పటికీ పనిచేస్తున్నాయి. సాహితీ స్రవంతి, ఆస్వాదన సాహితీ సమితి వంటి సంస్థల ద్వారా విద్యార్థులకు, ప్రజలకు తెలుగు సాహిత్యంపట్ల అవగాహన కల్పిస్తూ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సాహితీ సేవలో సాహితీ స్రవంతి



ఒక జాతి సంస్కృతినీ, ఔన్నత్యాన్ని తెలియజేయాలన్నా, ఒకరి భావాల్ని మరొకరికి చేరవేయాలన్నా భాషనుమించిన ఉపకరణం మరొకటిలేదు. పరాయిభాషలు ఎన్ని నేర్చుకున్నా, కన్నతల్లి వంటి మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది. అనేక ఆటుపోట్లకు గురౌతున్న మన తెలుగుభాషను, సాహిత్యానికి జనజీవాలు నింపి కొంతవరకైనా మన భాషను, మన సాహిత్యాన్ని కాపాడుకోవాలని కాకినాడ సాహితీస్రవంతి సంస్థ ద్వారా ప్రతినెలా క్రమం తప్పకుండా పలు సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పుస్తకావిష్కరణలు, ప్రముఖ కవుల జయంతులు, వర్ధంతులు, పుస్తక సమీక్షలూ వంటికి జరుపుతున్నాం. కళాశాలల విద్యార్థులకు కథ, కవిత్వంపై కార్యశాలలు(వర్క్‌షాప్) నిర్వహించి తెలుగు సాహిత్యంపై అవగాహన కల్పిస్తున్నాం.

-మార్ని జానకిరామచౌదరి,
సాహితీ స్రవంతి కాకినాడ నగర అధ్యక్షుడు

వెయ్యి కోట్ల కుంకుమార్చన లక్ష్యంగా మహాశక్తి యాగం

- ఐశ్వర్య రక్ష కంకణాల పంపిణీకి ఏర్పాట్లు
- సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 3 వరకు యాగం
- స్వామి పరిపూర్ణానంద సరస్వతి



సర్పవరంజంక్షన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వెయ్యి కోట్ల కుంకుమార్చన లక్ష్యంగా కాకినాడ శ్రీపీఠంలో సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 3వరకు మహాశక్తి యాగం-2025 నిర్వహించనున్నట్లు స్వామి పరిపూర్ణానంద సరస్వతి తెలిపారు. గురువారం కాకినాడ రూరల్ రమణయ్యపేట శ్రీపీఠం వ్యవస్థాపకుడు స్వామి పరిపూర్ణానంద సరస్వతి విలేకరులతో మాట్లాడారు. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 11 రోజులపాటు జరిగే మహాశక్తి యాగంలో భాగంగా వంద కోట్ల కుంకుమార్చనలో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకుంటామన్నారు. దసరాకు జరిగే మహాశక్తియాగంలో 300కోట్ల కుంకుమార్చనకు చారిత్రక ఘట్టానికి కాకినాడ శ్రీపీఠం వేదిక కాబోతుందన్నారు. వందకోట్ల కుంకు మార్చనతో పాటూ వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, చండీ, సహస్ర రుద్ర మహారుద్రహోమాలన్నీ విశేష సంఖ్యలో నిర్వహించేందుకు ఆయా విభాగాల నిపుణుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. మాతృమూర్తి స్వర్గీయ సంకల్పం మేరకు ఆమె దాచుకున్న సొమ్ముతో మహాశక్తి యాగంలో పాల్గొన్న భక్తులకు స్వచ్ఛమైన రాగితో తయారుచేసిన ఐశ్వర్య రక్ష కంకణం పంపిణీకి శ్రీకారం చుడతామన్నారు. దాతలు, భక్తుల సహకారంతో కోటి మందికి అమ్మవారి ప్రసాదం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దేవీ శరన్నవ రాత్రుల్లో భాగంగా ఐశ్వర్యాంబిక అమ్మవారు పలురకాల దివ్య అలంకరణలతో భక్తులకు దర్శనమిస్తారన్నారు. ఈ మహాయజ్ఞంలో పాల్గొని వంద కోట్ల కుంకుమార్చన ఫలితంతో పాటూ ఐశ్వర్యాంబిక అమ్మకృపకు పాత్రులుకావాలని ఆకాంక్షించారు.

నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షల్లో గందరగోళం

జీజీహెచ్(కాకినాడ) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్ అధికారుల ఆధ్వర్యంలో రంగరాయ వైద్య కళాశాలలో జరుగుతున్న నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలో గురువారం గందరగోళం చోటుచేసుకుంది. అక్కడ కాపీయింగ్ జరుగుతుందంటూ కొంతమంది ప్రచారం చేసిన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆర్ఎంసీలో జీఎన్ఎం పరీక్షలు జరుగుతున్నా పరీక్షల నిర్వహణ బాధ్యతంతా జీజీహెచ్‌దే. పరీక్షల నిర్వహణలో పలు అవకతవకలు చోటు చేసుకున్నాయంటూ చేస్తున్న ప్రచారాల ప్రభావం ఆర్ఎంసీ అధికారులపై పడింది. పరీక్షల బాధ్యతలు పర్యవేక్షిస్తున్న జీజీహెచ్ ఉన్నతాధికారులు కాపీయింగ్ వ్యవహారంపై స్పందించారు. అసలు సంబంధమేలేని రంగరాయ వైద్యకళాశాల అధికారులు పరీక్షల నిర్వహణ తమకు సంబంధం లేదని, కేవలం పరీక్షల నిర్వహణ కోసం రూమ్స్‌ను వినియోగించుకునేందుకు అనుమతులు మాత్రమే ఇచ్చామని వారు తెలిపారు.

అష్టజ్యోతిర్లింగాలకు ఆర్టీసీ బస్సు



అష్టజ్యోతిర్లింగాల యాత్ర బస్సును ప్రారంభిస్తున్న డీఎం కుమార్

రావులపాలెం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అష్టజ్యోతిర్లింగాలు, పంచద్వారకులకు ప్రత్యేక ఆర్టీసీ బస్సు గురువారం బయలుదేరి వెళ్లింది. ఈ బస్సును ఆర్టీసీ డీఎం కుమార్ ప్రారంభించారు. బసవకళ్యాణ్, తుల్జాపూర్, భీమశంకర్ జ్యోతిర్లింగం, పర్లి వైద్యనాథ్ జ్యోతిర్లింగం, షిడిరి, గృష్ణేశ్వర జ్యోతిర్లింగం, ఎల్లోరా, నాసిక్, త్రయంబకేశ్వర్ జ్యోతిర్లింగం, డాకోర్, నిష్కలంక మహదేవ్, , బాగ్ధాన, సోమనాథ్ జ్యోతిర్లింగం, నాగేశ్వర్ జ్యోతిర్లింగం, ద్వారకా, భేట్ ద్వారకా, మేదేరా, నాథద్వార్, రాజ్యసమండ కంక్రోలి, ఉజ్జయిని మహాకాలేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారేశ్వర జ్యోతిర్లింగం, ఏకవిరిక శక్తిపీఠం, బాసర పుణ్యక్షేత్రాల దర్శనం అనంతరం సెప్టెంబరు 11న రావులపాలెం చేరుతుందన్నారు. టిక్కెట్ ధర రూ.21వేలుగా నిర్ణయించారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఐ.టి.ఐ.ల్లో మూడో విడత కౌన్సెలింగ్

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):కాకినాడ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గల ప్రభుత్వ ప్రైవేటు ఐ.టి.ఐ.ల్లో 2025-26కుగాను మూడో విడత కౌన్సెలింగ్ కోసం హాజరుకావాల్సిందిగా అభ్యర్థులను కాకినాడ ప్రభుత్వ ఐ.టి.ఐ. ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాల వర్మ కోరారు. ఏ ఐటీఐలో చేరాలనుకుంటున్నారో ఆ ఐటీఐలలో మూడో విడత రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేయించుకున్న వారు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్, వెరిఫికేషన్ స్లిప్‌లను ఈనెల 29న, ప్రైవేట్ ఐటీఐలో అయితే ఈనెల 30న ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని వేణుగోపాలవర్మ తెలిపారు. వివరాలకు 08842348182/ 9440428182లో సంప్రదించాలి అన్నారు.

తర్జనభర్జన

- చేబ్రోలులో అర్ధరాత్రి వరకూ డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- సర్వర్‌లో సాంకేతిక సమస్యతో ఆలస్యం
- 1351 మందికి 1,029 అభ్యర్థులకే జనరేట్ అయిన కాల్‌లెటర్లు
- కొందరికి రాత్రి వరకూ జనరేట్ అయిన కాల్‌లెటర్లు
- అర్ధరాత్రి దాటినా కొనసాగుతున్న ప్రక్రియ
- నేడూ వెరిఫికేషన్ ..
- ఫిట్స్‌తో అస్వస్థతకు గురైన అభ్యర్థి

గొల్లప్రోలురూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో సర్టిఫికెట్లు తనిఖీ, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ అధిక సమయం తీసుకుంటుండడంతో ప్రక్రియ ఆలస్యంగా సాగుతోంది. అర్ధరాత్రి దాటిన తర్వాత సర్టిఫికెట్ల పరిశీలనను అధికారులు కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఈ ప్రక్రియ కొనసాగనున్నది. మెగా డీఎస్సీ 2025 మెరిట్‌లిస్ట్‌లో ఉండి కాల్‌లెటర్లు అందుకున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన అన్ని కేటగిరీల అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పక్రియ కోసం నియమించిన 25 ప్రత్యేక బృందాలు ధృవీకరణపత్రాల తనిఖీ ప్రారంభించారు. గురువారం నాటికి అప్‌డేట్ అయిన సమాచారం ప్రకారం 1351 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లును ఈ బృందాలు పరిశీలించాల్సి ఉంది. అయితే గురువారం సాయంత్రం వరకూ 1029 మంది అభ్యర్థుల కాల్‌లెటర్లు మాత్రమే జనరేట్ అయ్యాయి. మిగిలిన వారికి కాల్‌లెటర్లు జనరేట్ కాలేదు. అయిదు బృందాలకు సంబంధించి ఒక్క కాల్‌లెటర్ జనరేట్ కాకపోవడంతో మిగిలిన 20 బృందాలే పరిశీలన పక్రియ చేపట్టాయి. ఉదయం 7 గంటలకే సర్టిఫికెట్లు వెరిఫికేషన్ జరుగుతున్న కళాశాల ప్రాంగణానికి అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు, బంధువులు, సహాయకులతో కలిసి వచ్చారు పది గంటలకు వెరిఫికేషన్ పక్రియ ప్రారంభించారు. గురువారం కాల్ లెటర్లు అందుకున్న అభ్యర్థులు శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల కల్లా హాజరుకావాలని డీఈవో తెలిపారు.



ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆరుబయట వేచియున్న అభ్యర్థుల బంధువులు, (ఇన్‌సెట్లో) ఆరునెలల చిన్నారితో వచ్చిన కొత్తపల్లికి చెందిన సౌజన్య

వెంటాడిన సాంకేతిక సమస్యలు

అభ్యర్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన సర్టిఫికెట్లును ఫిజకల్‌గా తీసుకువచ్చిన ఒరిజనల్ సర్టిఫికెట్లుతో సరిచూసి తనిఖీ అనంతరం వాటిని మరలా బృందాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రవ్యాప్తంగా ఒకే సమయంలో పక్రియ జరుగుతున్న నేపథ్యంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌కు అధిక సమయం తీసుకుంది. అది కాక సర్వర్‌లో సాంకేతిక సమస్యలతో పక్రియ ఆలస్యంగా జరిగింది. రాత్రి 8గంటల వరకూ కేవలం 680మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయింది. అర్ధరాత్రి 12 గంటల దాటిన తర్వాత వెరిఫికేషన్ పక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారం కొనసాగుతుందని విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ మువ్వా రామలింగం తెలిపారు. కాకినాడ డీఈవో పిల్లి రమేష్‌తో కలిసి పక్రియ జరుగుతున్న తీరుని ఆయన పరిశీలించారు. అందరి అభ్యర్థులకు కాల్‌లెటర్లు జనరేట్ అవుతాయని ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని స్పష్టంచేశారు. సాయంత్రం నుంచే కొందరి అభ్యర్థులవి జనరేట్ అవుతున్నాయని తెలిపారు. వెరిఫికేషన్ పక్రియలో కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఈవోలు, డీవైఈవోలు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. కాగా అభ్యర్థులు, వారి సహాయకులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో భోజనం, టిఫిన్ సదుపాయం కల్పించారు.

ఫిట్స్ వచ్చి అస్వస్థత

తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు చెందిన అభ్యర్థి దాదాజీ రూమ్ నెంబరు 17లో జరుగుతున్న సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పక్రియకు హాజరయ్యారు. ఆ సమయంలో ఫిట్స్ వచ్చి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తనిఖీబృందాల సభ్యులు వచ్చి ఇనుప తాళం చెవి పెట్టడంతో తేరుకున్నారు. అనంతరం అతను ఎస్జీటీ పోస్టుకు సంబంధించి సర్టిఫికెట్లు వెరిఫిషన్ చేయించుకున్నారు.

401వ ర్యాంకు వచ్చినా

కాకినాడకు చెందిన కొల్లు లావణ్యకు డీఎస్సీలో 401వ ర్యాంకు వచ్చి ఎస్జీటీ పోస్టుకు ఎంపికయ్యారు. అయితే ఈమెకు గురువారం సాయంత్రం వరకూ కాల్‌లెటరు జనరేట్ కాలేదు. దీనితో చేబ్రోలు వచ్చి ఇక్కడ విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసింది. రాత్రికి లేదా ఉదయానికి కాల్‌లెటర్ వస్తుందని, శుక్రవారం రావాలని అధికారులు సూచించారు.

చిన్నారులతో వచ్చి

డీఎస్సీకి ఎంపికైన పలువురు మహిళా అభ్యర్థులు ఏడాది లోపు చిన్నారులతో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ పక్రియకు వచ్చారు. వీరికి భర్త లేదా, తల్లులు తోడుగా వచ్చారు. అధిక సమయం తీసుకోవడంతో చిన్నారులను ఊరుకోబెట్టడానికి ఇబ్బందులు పడ్డారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్టు

- లారీల బ్యాటరీలు చోరీ చేస్తూ అమ్మకాలు
- 18 బ్యాటరీలు స్వాధీనం
- ఇద్దరు నిందితుల అరెస్టు



దొంగిలించిన బ్యాటరీలు, ముద్దాయిలతో ఆలమూరు పోలీసులు

ఆలమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ఉన్న లారీల బ్యాటరీలను దొంగిలించి అమ్మకాలు చేస్తున్న అంతర్ జిల్లాల దొంగల ముఠాను ఆలమూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 18న రాత్రి చొప్పెల్ల, జొన్నాడ ప్రాంతాలలో పార్కింగ్ చేసిన లారీల నుంచి 10 బ్యాటరీలు, అలాగే రావులపాలెం మండలం గోపాలపురంలో 4, జూలై నెలలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు బ్యాటరీలు దొంగతనానికి గురికావడం జరిగింది. ఈమేరకు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక టీంను తయారు చేసి విచారణ చేయగా ఎన్టీఆర్ జిల్లా చంద్రపాలెం మండలానికి చెందిన ఇరువురు ముద్దాయిలుగా గుర్తించి ఆమేరకు సీసీ కెమెరా ఆధారంగా వివరాలు సేకరించి స్పెషల్ టీం కృషితో ఇరువురు ముద్దాయిలను అదుపులోకి తీసుకుని విచారించడం జరిగిందన్నారు. దీంతో వారు దొంగిలించిన 18 బ్యాటరీలు, తరలించిన వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని చవల శ్రీనివాస్, వనపర్తి ఉదయకిరణ్ అనే ముద్దాయిలను అరెస్టు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. వీరిపై ఆలమూరు, రావులపాలెం, కొత్తపేటలలో కేసులు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ నరేష్ వివరించారు. చోరీకి గురైన బ్యాటరీల సుమారు రూ.2.5 లక్షలు నిర్ధారించడం జరిగిందని బ్యాటరీలు లారీ యాజమాన్యులను అందించినట్లు ఆయన చెప్పారు. బ్యాటరీలు స్వాధీనం చేసుకోవడం, ముద్దాయిలను అదుపులోకి తీసుకోవడంతో కృషి చేసిన సిబ్బంది చిట్టిబాబు, మూర్తిను అభినందించారు. ముద్దాయిలను ఆలమూరు కోర్టులో హాజరుపరచగా ముద్దాయిలకు న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- మూలపేటలో వాలీబాల్ స్తంభం ఏర్పాటు చేస్తుండగా...

కొత్తపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వాలీ బాల్ కోర్టులో ఇనుప స్తంభం ఏర్పాటు చేస్తుండగా సమీపంలో విద్యుత్ తీగలకు తగిలి షాక్‌కొట్టిన కొట్టిన సంఘటనలో యువకుడు మృతి చెందగా, మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం మూలపేటలో బుధవారం చోటు చేసుకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయక చవితి సందర్భంగా పాఠశాలలకు సెలవు కావడంతో మూలపేటకు చెందిన ఏడిద చరణ్ (19) వల్లూరి నగేష్, మడికి నిఖిల్, విష్ణు, రాజు కలిసి స్థానిక ఉన్నతపాఠశాల ఎదురుగా శివాలయం సమీ పంలో ఉన్న వాలీబాల్ కోర్టులో స్తంభం ఏర్పాటుచేసేందుకు సన్నాహాలు చేశారు. గొయ్యిలో స్తంభం నిలబెట్టేందుకు ఆరుగురు యువకులు ప్రయత్నం చేసేలోగా స్తంభం పక్కనే ఉన్న హైవోల్టేజి కరెంటు స్తంభంపై పడింది. దీంతో విద్యుత్‌షాక్‌తో చరణ్ (19) అక్కడిక్కడే ప్రాణాలు విడిచాడు. నగేష్, నిఖిల్, విష్ణు,తేజ, రాజుకు తీవ్ర గాయాలవడంతో తొలుత పిఠాపురం జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ నుంచి అత్యవసర చికిత్స కోసం కాకినాడ జనరల్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కొత్తపల్లి ఎస్ఐ జీ. వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.



మృతిచెందిన ఏడిద చరణ్ (ఫైల్)

పెద్దాపురంలో లైన్‌మెన్..

- మరొకరికి తీవ్రగాయాలు

పెద్దాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో లైన్‌మెన్ మృతి చెందగా, మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దాపురంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక కొండయ్యపేటకు చెందిన కే. రామకృష్ణ స్థానిక పాశిల వీధిలో సహచరుడు చిన్నితో కలిసి విద్యుత్ మరమ్మతులు చేస్తున్నారు. ఈలోగా ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ ప్రసరించడంతో రామకృష్ణ షాక్‌కు గురయ్యాడు. ఇలాగా అతన్ని కాపాడే ప్రయత్నంలో చిన్నబాబుకు తీవ్ర గాయాలయ్యాలు. దీన్ని గమనించిన విద్యుత్ సిబ్బంది గాయపడినవారిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే రామకృష్ణ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, చిన్నిబాబును మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేవలం విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మృతి చెందినట్టు మృతిడి బంధువులు ఆరోపించారు.



విద్యుదాఘాతంతో మృతిచెందిన రామకృష్ణ

ఈ విషయంపై సీఐ విజయం శంకర్ పర్యవేక్షణలో ఎస్ఐ మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం తాగడానికి డబ్బులివ్వలేదని..

తండ్రిపై తనయుడి దాడి

- తీవ్ర గాయంతో చికిత్స పొందుతూ మృతి
- ఉండ్రాజవరం మండలం దమ్మెన్నులో ఘటన

ఉండ్రాజవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై తనయుడు దాడి చేసిన సంఘటన ఉండ్రాజవరం మండలం దమ్మెన్నులో బుధవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన కొల్లి కృష్ణయ్య (65) గతంలో రిక్షా నడుపుతూ జీవనం సాగించేవాడు. ప్రస్తుతం వృద్ధాప్యం కారణంగా రిక్షా తొక్కలేక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, ఈయన భార్య కొన్నేళ్ల క్రితం మరణించింది. ఇతనికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వారందరికీ వివాహాలయ్యాయి. అయితే కృష్ణయ్య కూలి పనులకు వెళ్లిన డబ్బులతో మద్యం సేవించి వస్తూ స్థానిక కమ్యూనిటీ హాలు వద్ద న్యూసెన్స్ చేస్తున్నాడని, దీంతో తమ పరువుపోతుందని కొడుకు సుధాకర్ తరచూ తండ్రిని మందలించేవాడు. కాగా, మంగళవారమూ అదే కమ్యూనిటీ హాలు వద్ద తండ్రి ఉండటాన్ని గమనించి కొడుకు సుధాకర్ మద్యం తాగడానికి తనకు డబ్బులు కావాలని అడగ్గా, ఇవ్వకపోవడంతో కాలితో తన్ని కర్రతో తలపై కొట్టడంతో కృష్ణయ్యకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ నుంచి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ఆసుపత్రికి తరలించిగా, చికిత్స పొందుతూ బుధవారం రాత్రి కృష్ణయ్య మరణించాడు. మృతుడు కుమారుడు కొల్లి నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండ్రాజవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కొల్లి కృష్ణయ్య (ఫైల్)

మళ్లీ పెరుగుతోంది..

- ఉధృతమవుతున్న గోదావరి
- ధవళేశ్వరం వద్ద నేటి సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం

ధవళేశ్వరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఉప్పొంగి ప్రవహించి ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహించిన గోదావరి మళ్లీ ఉధృతమవుతోంది. అల్ప పీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి నుంచి వరద ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి వరద పెరుగుతోంది.దీంతో కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను 1.5మీటర్ల మేర పైకి ఎత్తి 5,15,938 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలివేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గురువారం సాయంత్రానికి నీటి మట్టం 10.40 అడుగులగా నమోదయింది. ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహా న్ని అంచనా వేస్తూ శు క్ర వారం సాయంత్రాని కి ధవళేశ్వరం వద్ద నీ టి మట్టం మొదటి ప్ర మాద హెచ్చరిక స్థా యికి చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం సాయంత్రానికి 38.60 అడుగులకు చేరుకుంది.

కలప కోసం..

కూనవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శబరి నది ఉప్పొంగిన ప్రతిసారి ఆ నదిలో నుంచి విలువైన కలప కొట్టుకు వస్తుంది. దానిని పట్టుకోవడానికి ప్రతిసారి ఇక్కడ యువత పెద్ద సాహసమే చేస్తారు. శబరి బ్రిడ్జి పైనుంచి (సుమారు 40 అడుగుల ఎత్తు) ఒకేసారి దూకేస్తారు. నదిలో కొట్టుకుపోతున్న కలపను ఆమాంతం పట్టేస్తారు. సుమారు ఐదు కిలోమీటర్లు నదిలో ఈదుతూ వాటిని ఒడ్డుకు తీసుకొస్తారు.



నిలిచిన రాకపోకలు

చింతూరు/వీఆర్ పురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎడతెరపి లేని వర్షాల ప్రభావంతో శబరి, గోదావరి, సీలేరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతూరు వద్ద గురువారం రాత్రి 7గంటలకు శబరి 36 అడుగుల మేర ప్రవహిస్తోంది. అదే దశలో భద్రాచలం వద్ద గోదావరి 38.60 అడుగుల మేర ప్రవహిస్తోంది.దీంతో మన రాష్ట్రం మీదుగా ఛత్తీస్‌గడ్, ఒడిస్సాలకు వెళ్లే రహదారులు మూసుకపోయాయి. ఒడిస్సాకు వెళ్లే 326వ నెంబరు జాతీయ రహదారిపై చింతూరు మండలం, నిమ్మలగూడెం-కుయుగూరుల నడమ రహదారి పూర్తిగా ముంపునకు గురైంది. ఛత్తీస్‌గడ్‌కు వెళ్లే 30నంబరు జాతీయ రహదారిపై ఎర్రబోరు పరిసర ప్రాంతంలో రహదారిపై వరద నీరు చేరుకుంది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. చీకటివాగు, సోకిలే రు వాగుల్లో భారీగా వరద నీరు చేరడంతో చింతూరు వరరాచమంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. కల్లేరు, ముకునూరు, ఏజీ కోడేరు, రామన్నపాలెం, పెద్ద సీతనపల్లి పంచాయతీల గ్రామాలు జలదిగ్భంధంలో ఉన్నాయి. దీంతో ఆ ప్రాంత వాసులు నిత్యావసర వస్తువుల కోసం అవస్థలు పడుతున్నారు. శబరి ఉధృతి గురువారం ఉదయం నుంచి కాస్త తగ్గుముఖం పట్టినప్పటికీ కూనవరం వద్ద గోదావరి నది ఎగపోటుని వ్వడంతో ఆ ప్రభావం లోతట్టు ప్రాంతాలపై పడింది. కాగా అధికారులను అప్రమత్తం చేశామని చింతూరు పీవో శుభం నొక్వాల్ పేర్కొ న్నారు. వీఆర్ పురం మండలంలోని చింతూరు, వీఆర్ పురం మండలాల ప్రధాన రహదారులపై వరదనీరు చేరడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 39 అడుగులకు చేరుకుంది. వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వారం రోజుల వ్యవధిలో గోదావరి వరదలు రెండో సారి రావడంతో వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి



చింతరేవుపల్లి-కన్నాయిగూడెం రోడ్డుపైకి చేరిన వరదనీరు



నిమ్మలగూడెం -కుయుగూరు హైవేపై వరదలో చిక్కుకున్న లారీ



నిమ్మలగూడెం-కుయుగూరు హైవేపై వరద నీరు

గోదావరిలో వృద్ధుడి గల్లంతు!

పోలీసుల ముమ్మర గాలింపు చర్యలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంక పంచాయతీ శివా రు వీధివారి లంకకు చెందిన పల్లి చిట్టియ్య (65) బుధవారం తాతపూడి లంకకు వెళ్లి తిరిగి రాలేదు. గోదావరిలో పడి గల్లంతై ఉండవచ్చని స్థానికుల నుంచి అనుమానం వ్యక్తమవుతోంది. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. గల్లంతైన వ్యక్తి కోసం నదిలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందంతో కలిసి రెవెన్యూ, పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. రామచంద్రపురం ఎస్‌డీపీవో రఘువీర్ పర్యవేక్షణలో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, మండపేట రూరల్ సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ హరీష్‌కుమార్, తహశీల్దార్ శ్రీనివాస్, గోదావరి తొగరపాయవద్ద గాలింపు చర్యల్లో పాల్గొన్నారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో గాలింపు కష్టతరంగా మారిందని పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి ఏమైనా ఆచూకీ తెలిసిన వారు అంగర ఎస్ఐ సెల్ 9440900770, మండపేట సీఐ సెల్ 9440796537 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.





కేదార్లంక నదిలో గాలిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్, పోలీసులు, చిట్టియ్య(ఫైల్)

మహిళలే టార్గెట్..

- అంతర్ జిల్లాల చైన్ స్నాచింగ్ ముఠా గుట్టురట్టు
- రూ.17 లక్షల బంగారం స్వాధీనం
- 6 కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

రాజోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మహిళల మెడలో గొలుసులు లాక్కుని వెళుతున్న అంతర్‌జిల్లాల చైన్ స్నాచింగ్ ముఠాను రాజోలు పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.17.30 లక్షల విలువచేసే 171 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు.రాజోలు పోలీసు సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, సిబ్బంది బుధవారం రాజోలు మండలం శివకోటి వై.జంక్షన్ వద్ద ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం టౌన్‌కు చెందిన పి.పాండురంగారావు, ఏలూరు జిల్లా కలిదిండి మండల కలిదిండి గ్రామానికి చెందిన ఎల్.మురళీకృష్ణను చైన్ స్నాచింగ్ కేసులో అరెస్టు చేశామని తెలిపారు. పాండురంగారావు భీమవరంలో అమృత పేరు మీదుగా టిఫిన్ సెంటర్ నడుపుతూ పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి వ్యాపారంలో వచ్చే సంపాదన సరిపోక అప్పుల పాలయ్యాడు. సులభంగా డబ్బు సంపాదించాలని చైన్ స్నాచింగ్, ఇతర దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. పాండురంగారావుపై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఏలూరు జిల్లాల్లో ఆరుకు పైగా దొంగతనాల కేసులు ఉన్నాయి. మురళీకృష్ణ. కలిదిండిలోని సినీ ఆర్కెస్ట్రాలో ప్యాడ్స్ కొడుతూ జీవనం సాగిస్తున్నాడు. కొవిడ్ సమయంలో ఆర్కెస్ట్రాలో ప్రోగ్రాంలు లేక పాండురంగారావు హోటల్‌లో మూడేళ్లు పనిచేశాడు. ఆ సమయంలో పాండురంగతో కలిసి మద్యం పేకాటలకు అలవాటు పడ్డాడు. సంపాదన సరిపోకపోవడంతో అప్పులు చేయడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే పాండురంగతో కలిసి చైన్ స్నాచింగ్, ఇతర దొంగతనాలు చేశాడు. చోరీ కేసులను ఛేదించడంలో కృషి చేసిన క్రైమ్ సీఐ, స్థానిక సీఐ వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

ఇద్దరు దొంగలు అరెస్టు

- ధర్మవరం చోరీ ఘటనలో రూ.6.3 లక్షల బంగారు ఆభరణాలు స్వాధీనం
- పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు, చోరీ సొత్తు

ప్రత్తిపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో జరిగిన చోరీ ఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రూ.6.3 లక్షలు విలువలైన 23 తులాల బంగారం, 90 గ్రాముల వెండిని పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం సాయంత్రం ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్ వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రీహరిరాజు వెల్లడించారు.రాజమహేంద్రవరంలోని భవానీపురం క్వారీ సెంటర్‌కు చెందిన కొవ్వూరి సునీల్, రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు గ్రామానికి చెందిన మోర్తా దీవెన రాజు.. ఈ నెల 21న రాజమహేంద్రవరం నుంచి గంటకు రూ.250 అద్దెకు బైక్ తీసుకున్నారు. ప్రత్తిపాడు మండలంలోని ధర్మవరం వెళ్లి స్థానిక జగనన్న కాలనీలో గాలి తలుపులయ్య పగటిపూట ఇంట్లోకి చొరబడి 247 గ్రాముల బంగారు, 90 గ్రాముల వెండి, 3 గ్రాముల ప్లాటినం ఉంగరాలను అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. చోరీకి ముందు ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించడం, తదనంతరం ముసుగులు ధరించి ఇద్దరు చోరీకి పాల్పడడం తలుపులయ్య ఇంటి పరిసరాల్లోని సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యాయి. గురువారం ఇద్దరు వ్యక్తులు ప్రత్తిపాడు పాదాలమ్మ ఆలయం వద్ద అనుమానాస్పద రీతిలో తిరుగుతుండగా సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం అదుపులోకి తీసుకుని విచారించగా ధర్మవరం జగన్న కాలనీలో చోరీకి పాల్పడిన విషయం బయట పెట్టారని డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. అలాగే చోరీకి ఉపయోగించిన బైక్‌తో పాటు ఐరన్ కటింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. నిందితుల్లో ఒకరు మైనర్ అని పేర్కొన్నారు. 45 గంటల వ్యవధిలో చోరీని ఛేదించిన సీఐ సూర్య అప్పారావు, ఎస్.లక్ష్మీకాంతంతో పాటు ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఎస్పీ బిందుమాధవ్, డీఎస్పీ శ్రీహరిరాజు అభినందించారు. నేరాల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకంగా మారిన దృష్ట్యా ఇళ్ల వద్ద, వ్యాపారులతో పాటు, దేవాలయాలు ఇతర సంస్థల వద్ద వాటిని నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని డీఎస్పీ చెప్పారు.



విద్యార్థిపై దాడిలో కేసు నమోదు

ఇద్దరు అరెస్ట్.. జువైనల్ కోర్టుకు బాలురు

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మోరంపూడిలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో పదో తరగతి విద్యార్థిపై దాడి ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేశారు. బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్‌లోని తన సహచర విద్యార్థులు సీసీ కెమెరాలను తొలగించి తమ వద్ద దాచుకున్న విషయాన్ని ఓ విద్యార్థి ప్రిన్సిపాల్‌కి చెప్పాడు. దీంతో అతడిని చంపాలనే ఉద్దేశంతో ఆ ఇద్దరు విద్యార్థులు కర్రలతో కొట్టి, ఐరన్ బాక్స్‌ని వేడి చేసి శరీరంపై పలుచోట్ల గాయాలు చేశారు. దీనిపై ఆ ఇద్దరు విద్యార్థులను జువైనల్ కోర్టులో హాజరు పరిచినట్టు సీఐ తెలిపారు. ప్రిన్సిపాల్ గుట్టుపల్లి మధుసూదన్, హాస్టల్ ఫ్లోర్ ఇన్‌చార్జి పల్లి దామోదర్‌ని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

సీఎంఆర్‌ఎఫ్.. పేదవాడి సంజీవని

ఎమ్మెల్యే గోరంట్ల.. 13 మంది లబ్ధిదారులకు రూ.21,34,680 చెక్కుల పంపిణీ


లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

ధవళేశ్వరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి చేకూరని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి సంజీవనిలా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. గురువారం ఉదయం తన కార్యాలయంలో 13 మంది లబ్ధిదారులకు రూ.21,43,680 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. వీరిలో అత్యధికంగా ధవళేశ్వరానికి చెందిన చిన్నారి గనగళ్ల శ్రీలత చికిత్సకు రూ.7లక్షలు విలువైన ఎల్‌వోసీ, శాటిలైట్ సిటీకి చెందిన లాలం పైడి రాజుకు రూ.3.09 లక్షలు, ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన చిన్నారి పాతూరి అక్షయశ్రీ కుటుంబానికి రూ.3 లక్షల ఆర్థిక సహాయం, ధవళేశ్వరం టీడీపీ నాయకుడు నీలి కోటేశ్వరరావు తల్లికికు రూ.1.60 లక్షలతోపాటు కడియపు సావరం, కడియం, మాధవరాయుడుపాలెం, మురమండ, వీరవరం గ్రామాలకు చెందిన వారికి చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో నాయకులు పండూరి అ ప్పారావు, పుక్కెళ్ళ రాజు, సావాడ శ్రీనివాసరెడ్డి, యర్రమోతు ధర్మరాజు, ఆళ ఆనందరావు, ఎ.శ్రీను పాల్గొన్నారు.

రేషన్ సరఫరా పారదర్శకంగా జరగాలి

ఆర్డీవో కృష్ణనాయక్


రంగంపేటలో స్మార్ట్‌కార్డుల పంపిణీ వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో

రంగంపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో సరఫరా చేస్తున్న వస్తువులు పారదర్శకంగా పంపిణీ చేయాలని ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న పట్టాదారు ఫొటో అప్‌లోడింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఫొటో అప్‌లోడింగ్ ప్రక్రియ సజావుగా అమలు కావాలని, ఇది భూ సమాచారాన్ని డిజిటలైజ్ చేసి అప్‌డేట్ చేయడానికి రెవెన్యూశాఖ తీసుకుంటున్న చర్యలలో భాగమన్నారు. అలాగే భూసంబంధిత రికార్డులను, ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం రంగంపేటలో 11వ రేషన్‌షాపును, స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా స్మార్ట్‌రైస్ కార్డులు పొందేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు పారదర్శకంగా, సులభంగా సేవలు అందించడం ప్రభుత్వ లక్ష్యమని ఆర్డీవో పేర్కొన్నారు. రేషన్ పంపిణీ పారదర్శకంగా, సజావుగా పంపిణీ చేయాలని రేషన్‌షాపు డీలర్లకు, సంబంధిత సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆర్డీవో వెంట తహశీల్దార్ కోసు అనసూయ ఉన్నారు.

విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా వామపక్షాల నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా గురువారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం, ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. ఈ మేరకు రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లో జరిగిన నిరసన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు గత వైసీపీ ప్రభుత్వం స్మార్టు మీటర్లు తీసుకొస్తే, ఆ విధానాన్ని చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తోందని, దీని వల్ల కరెంట్ బిల్లు తడిసి మోపెడవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం స్మార్టు మీటర్ల విధానం రద్దు చేసే వరకూ ప్రజలు పోరాటం చేయాలని కోరారు. సీపీఎం నాయకులు బి.పవన్, జె.రాంబాబు, పూర్ణిమరాజు, ఎస్ఎస్ మూర్తి, సీపీఐ నాయకులు వి.కొండలరావు, సప్పా రమణ, పి.లావణ్య, కె.జ్యోతిరాజు, త్రిమూర్తులు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు సీహెచ్ వెంకటేశ్వర్లు, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నల్లమిల్లి పుట్టినరోజు

బిక్కవోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పుట్టినరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి మహిళలు బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బేరా వేణమ్మ, జుత్తుగ సూర్యకుమారి, తెలుగు మహిళలు సత్యగౌరి, వై.చిన్నమ్మ, ఎన్.సత్యవేణి, సత్యవతి, చంద్రకాంతం పాల్గొన్నారు. కొమరిపాలెంలో టీడీపీ నాయకుడు మల్లిడి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు గుడిమెట్ల దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు డీవీఆర్, అడపా సత్తిరాజు పాల్గొన్నారు.

రంగంపేట: ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి జన్మదినం సందర్భంగా రంగంపేట మండల ప్రజా పరిషత్ పాఠశాల భవిత సెంటర్‌లో విద్యార్థులకు కూటమి నాయకులు పండ్లు, చాక్లెట్స్ పంచారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గారపాటి రాంబాబు, ఉండవిల్లి గిరిబాబు, రాంబాబు, పోతుల చిన్నకాపు, దూబాసి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగులకు సత్కారం


రాజమహేంద్రవరం డిపోలో ఆదర్శ ఉద్యోగులకు అభినందన సత్కారం చేసిన దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందజేయాలని ఆర్టీసీ రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్ అన్నారు. గురువారం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఆదర్శ ఉద్యోగుల అభినందన సత్కార కార్యక్రమం డిపో ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా డిపోలో అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లు, అత్యధిక ఈపీకే తెచ్చిన ఐదుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు, అదేవిధంగా ప్రతిభ కనబరచిన ఇద్దరు గ్యారేజీ సిబ్బందిని డీఎం మాధవ్ ప్రశంసాపత్రాలు, నగదుతో సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్(టి) ఎం.అజయ్‌బాబు, అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.నాగలక్ష్మి, ట్రాఫిక్, గ్యారేజీ, సెక్యూరిటీ, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సమాజంలో జరుగుతున్న ప్రస్తుత పరిణామాల దృష్ట్యా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవలసిన బాధ్యత న్యాయవాదులందరిపై ఉందని రాజమండ్రి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అల్లంపల్లి రామకృష్ణ అన్నారు. ఇండియన్ లాయర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30, 31 తేదీల్లో గుంటూరులో జరిగే ఇండియన్ లాయర్ల అసోసియేషన్ మహాసభల పోస్టర్‌ను గురువారం ఆయన బార్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆవిష్కరించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ గుంటూరులో జరిగే రాష్ట్ర మహాసభలకు న్యాయవాదులంతా తరలి రావాలని కోరారు. ఐఎల్‌ఏ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు టి.పృథ్వీరాజు మాట్లాడుతూ న్యాయవాదులు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.కార్యక్రమంలో రాజమండ్రి బార్ అసోసియేషన్ ఐఎల్‌ఏ అధ్యక్షుడు కొత్తూరి ఆనంద్‌కుమార్, న్యాయవాదులు, పట్నాల శ్రీనివాస్, జి.మహాలక్ష్మి, అంబటి మురళీకృష్ణ, వైఎస్ స్వామి, ఆదిలక్ష్మి, వెంకటలక్ష్మి, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అఖండ గోదావరి అభివృద్ధి పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం కల్చరల్ ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన అఖండ గోదావరి ప్రాజెక్ట్ వల్ల పుష్కర్ ఘాట్‌లోని ఏ ఆలయానికి, ఏ ఇబ్బంది ఉండబోదని ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. స్థానిక పుష్కర్ ఘాట్‌లో చేపట్టిన అఖండ గోదావరి అభివృద్ధి పనులను ఆయన టూరిజం డిపార్ట్‌మెంటు, మునిసిపల్ అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి గురువారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రివర్ ఫ్రంట్ పనుల వల్ల గట్టు మీద ఉన్న విగ్రహాలను ఏ విధంగా యూనిఫారంగా పెట్టాలని నిర్ణయించామో ఆ విధంగానే పుష్కర్‌ఘాట్‌లో కూడా ఏ ఆలయానికి, ఏ వృత్తిదారునికి ఇబ్బంది లేకుండా మరింత శోభాయమానంగా తీర్చిదిద్దుతారని అన్నారు. అలాగే మొదటి, మూడో రైలు వంతెనల మధ్య ఉన్న వ్యూ పాయింట్‌కి కూడా ఈ ప్రాజెక్ట్ వల్ల ఎలాంటి విఘాతం కలగదని దీనిపై సోషల్ మీడియాలో వస్తున్న అపోహలకు ఆందోళన చెందనవసరం లేదని స్పష్టం చేశారు. కాగా వినాయక చవితి సందర్భంగా పుష్కర్ ఘాట్ దగ్గర వినాయక విగ్రహాలను, పత్రిని నిమజ్జనం చేయడానికి వస్తున్న భక్తుల నుంచి వాటిని సేకరించి గోదావరి కలుషితం కాకుండా విడివిడిగా వేరు చేస్తున్న శానిటేషన్ సిబ్బందిని, అభినందించారు.

జై..జై..గణేశా!


ధవళేశ్వరం రథం వీధిలో గణపతి విగ్రహానికి పూజలు చేస్తున్న మంత్రి దుర్గేష్

» భక్తిశ్రద్ధలతో వినాయక చవితి
» ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన గణనాథులు
» రాజానగరంలో రూ.3.60 లక్షలతో మహాభారతం గణపతి

దివాన్‌చెరువు/రంగంపేట/సీతానగరం/కోరుకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విఘ్నాలను తొలగించే వినాయక చవితిని అన్ని గ్రామాల్లో ప్రజలు బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రతి ఇంట మట్టి గణపతిని ప్రతిష్ఠించుకుని పాలవెల్లి కట్టి కలశస్థాపన చేసి పూజలు చేసుకున్నారు. వినాయక వ్రత కథ చదువుకున్నారు. విద్యార్థులు తమకు చదువు బాగా రావాలని వినాయకుడి ముందు పెన్నులు, పుస్తకాలు ఉంచి పూజల్లో పాల్గొన్నారు. దివాన్‌చెరువు, పాలచర్ల, లాలాచెరువు హౌసింగ్‌బోర్డుకాలనీ, కొత్తతుంగపాడు తదితర గ్రామాల్లో వినాయక నవరాత్రి మహోత్సవాలు ప్రారంభించారు. బుధవారం ఉదయం వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి వాటికి పూజలు చేయడం ద్వారా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తులు తమ ఇండ్లలో చవితి పూజలను పూర్తిచేసుకున్న అనంతరం తమ సమీపంలోని ఆలయాలు, ప్రత్యేక పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను దర్శించుకున్నారు. ఇక వినాయక చవితికి పందిళ్లలో ఏర్పాటు చేసే లడ్డూలకు ప్రత్యేకత ఉంటుంది. కొత్తతుంగపాడులోని గణపతి ఆలయంలో 100 కిలోలకు పైగా రెండు లడ్డూలను ఇద్దరు భక్తులు ఏర్పాటు చేశారు. పాతతుంగపాడులోని మత్స్యేంద్రనాథ్ దేవాలయంలో జరిగిన ఉత్సవాల్లో నూతన లంజపల్లి శ్రీను, వీరలక్ష్మి పాల్గొని పూజలు జరిపారు. కొత్తపల్లి గోవిందు 105 కిలోలు, గండి శివమణికంఠ 101 కిలోల లడ్డూలను దేవుడికి సమర్పించారని ఉత్సవ కమిటీ తెలిపింది. దీనితో బాటు దాదాపు మరో 20 మంది లడ్డూలను స్వామికి అందజేశారని అన్నారు. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఇంట ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు గణపతి పూజ చేశారు.

గోకవరం: గోకవరంలోని ఆర్టీసీ డిపో సమీపంలో భారీ విగ్రహన్ని ఏర్పాటు చేశారు. సీఎండీ లేఅవుట్ వద్ద గణపతి మండపంలో విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రతీ గ్రామంలో భక్తులు వేడుకల్లో పాల్గొని పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

రాజానగరం: రాజానగరంలోని వైఎస్సార్ జంక్షన్ సమీపంలో శ్రీలక్ష్మీ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది మహా భారత ఘట్టంలో అంశాలను ప్రతిబించే రీతిలో రూ.3.60 లక్షలతో 20 అడుగుల ఎత్తుతో హైదరాబాదులో రూపుదిద్దుకున్న కుబేర గణపతి ప్రత్యేక ఆకర్షణగా దర్శనమిస్తున్నారు. కుబేర గణపతి చుట్టూ శివపార్వతులు నాట్యం చేస్తుండగా, అయ్యప్పస్వామి, కుమారస్వామి తిలకిస్తున్నట్టు తీర్చిదిద్దిన కుబేర గణనాథుడు అందరినీ మైమరపిస్తున్నారు. మండపంలో ఏర్పాటు చేసిన దశావతారాల దృశ్యాలు భక్తులను అబ్బురపరుస్తున్నాయి. ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, పెందుర్తి అభిరామ్, జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తదితర భక్తులు దర్శించుకున్నారు. అనంతరం చెంతనే నిలబడి ఫొటోలు తీసుకుంటూ మురిసిపోతున్నారు. రాజానగరం బస్టాండ్ వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

బిక్కవోలు: వినాయకచవితి సందర్భంగా మండలంలో 62 మండపాలకు అనుమతులిచ్చామని ఎంపీడీవో నాగేంద్రప్రసాద్ తెలిపారు. బిక్కవోలు జువ్వలదొడ్డిలోని శ్రీలక్ష్మీగణపతి యూత్ ఏర్పాటు చేసిన 15 అడుగుల వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

అనపర్తి: అనపర్తిలోని మార్కండేయపురంలోని స్నేహయూత్ ఆధ్వర్యంలోను, బాపనమ్మ ఆలయ సమీపంలోను, కుమ్మరి వీధులలోను మండపాలను అలంకరించి గణనాథులను ప్రతిష్ఠ చేశారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పలు చోట్ల ఏర్పాటు చేసిన మండపాలను సందర్శించి వినాయక దర్శనం చేసుకున్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక 23వ వార్డు నందివాడ వీధిలోని శ్రీ వజ్ర గణపతి ఆలయ మందిరం వద్ద నవరాత్రి ఉత్సవాలు శ్రీ సాయి గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. చందా సత్రం చైర్మన్, వాకచర్ల కృష్ణ, సూర్యకుమారి దంపతులు కలశస్థాపన చేసి స్వామి వారికి అభిషేకం చేసి పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. పలువురు మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శిఘాకొళపు శివరామ సుబ్రహ్మణ్యం, రుడా మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి, పొలసాలపల్లి హనుమంతరావు, పోలు విజయలక్ష్మి, ప్రసాదుల హరనాథ్, మానే దొరబాబు, సంకిన భవాని ప్రియ, దొండపాటి సత్యండాబాబు తదితరులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పొత్తూరు యతిరాజ్, సంపత్‌కుమార్, పేరూరి మహేంద్రనాథ్,సరిదే ధన వెంకటేశ్వరరావు, కనమర్లపూడి చంద్రకాంత్, వాకచర్ల భరత్ ఫ్రెండ్స్ సర్కిల్ పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం సిటీలోని ప్రధాన సెంటర్లు, కూడళ్లలో అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. పుష్కరఘాట్ వద్ద నూలుదారపు పోగులతో గణపతి విగ్రహం, ఆర్యాపురంలో అష్టభుజ లక్ష్మీగణపతి ఆలయం వద్ద గణనాథుడి మండపం ఆకట్టుకుంది. లక్ష్మీవారపుపేటలో చిరుధాన్యాలతోను, రాజేంద్రనగర్‌లో ఏడు వేల నుంచి 8 వేల వరకూ రూపాయి బిళ్లలతో, నల్లమందు సందు, మెయిన్‌రోడ్డు, రైల్వే స్టేషన్, క్వారీ మార్కెట్ సెంటర్, భాస్కరనగర్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాల్లో భారీ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. నగరంలోని పలు గణపతి మండపాలను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సందర్శించి గణనాథుడికి పూజలు చేశారు. ఏకదంతుడి ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని, చవితి మండపాలకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ మంచి ఆలోచన అని అన్నారు. అలాగే నాళం భీమరాజు వీధిలో శ్రీ సిద్ధి లక్ష్మీ గణపతి స్వామిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. నాయకులు పాల్గొన్నారు. స్థానిక జిల్లా బీజేపీ కార్యాలయంలో వినాయక చవితి మండపాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ నాయకుడు పసుపులేటి గోవిందు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, కార్యదర్శులు రవిశంకర్, సూర్యకిరణ్, సత్యప్రసాద్, యానాపు ఏసు, వీరా వీరాంజనేయులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: వినాయక చవితి సందర్భంగా గ్రామంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన చవితి మండపాలను మంత్రి కందుల దుర్గేష్ సందర్శించి పూజలు చేశారు. రథం వీధిలో జనసేన నాయకుడు యడ్ల మహేష్ పర్యవేక్షణలో శివాలయం వద్ద కాణిపాకం వినాయకుడి రూపంలో కొలువుదీరిన గణపతిని దర్శించి పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు గణపతి మాలాధారణచేసి ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో వారిని అభినందించారు. అలాగే అంకాలమ్మ గుడి సెంటర్ యడ్ల వెంకటేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతిని దర్శించుకున్నారు. బస్టాండ్ సెంటర్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన బెల్లంతో చేసిన గణపతిని, అఫీషియల్ కాలనీలో ఏర్పాటైన గణపతిని సందర్శించారు.


గోదావరి గట్టు ఎమ్మెల్యే వాసు పూజలు


ఎమ్మెల్యే బత్తుల ఇంటి వద్ద వినాయక పూజలు


ఆర్యాపురంలో అష్టభుజ లక్ష్మీగణపతి


సీతానగరంలో వినాయకుడికి పూజలు

భారత్-తైవాన్‌ది బలమైన బంధం

» టీఈసీసీ డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ షు-చిహ్‌హ్వా
» జీజీయూలో అంతర్జాతీయ సదస్సు

రాజానగరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): భారత్-తైవాన్ దేశాలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో బలమైన సంబంధాలను సొంతం చేసుకున్నాయని టీఈసీసీ చెన్నై డైరెక్టర్ జనరల్ స్టీఫెన్ షు-చిహ్ హ్వా పేర్కొన్నారు. గ్రీన్ ఎకానమీ, సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్‌గ్రీన్ టెక్నాలజీలలో కృత్రిమ మేధ(ఏఐ)అంశాలపై అంతర్జాతీయ సదస్సు గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ)లో గురువారం ప్రారంభమైంది. తైవాన్ నేషనల్ సన్ యాట్-సెన్ యూనివర్శిటీతో భాగస్వామ్యంగా, తైవాన్ నేషనల్ సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్(ఎన్ఎస్‌టీసీ) సహకారంతో జీజీయూ ఛాన్సలర్ చైతన్యరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో టీఈసీసీ డైరెక్టర్ జనరల్ మాట్లాడుతూ ఎగుమతి, దిగుమతి రంగాల్లో ఇరు దేశాలు విశేషమైన పురోగతి సాధించాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సెమీకండక్టర్ తయారీ హబ్‌ను భారత్ ఆమోదించిందని,దాని అభివృద్ధికి తైవాన్ సహకరిస్తుందన్నారు.ఈ రంగంలో జీజీయూ అధ్యాపకులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని స్పష్టం చేశారు. తైవాన్‌లో 12కు పైగా అగ్రశ్రేణి యూనివర్శిటీల నిపుణులు, భారతీయ విద్యావేత్తలు ఈ సదస్సులో పాల్గొన్నారన్నారు. చైతన్యరాజు మాట్లాడుతూ పర్యావరణ అనుకూల ఉత్పత్తులు, సస్టైనబుల్ ఇండస్ట్రియల్ ప్రాక్టీసుల రూపకల్పనలో కృత్రిమ మేధ కీలకపాత్ర పోషిస్తుందన్నా రు. భవిష్యత్తులో ఏఐ ఆధారిత గ్రీన్ టెక్నాలజీలు ప్రకృతిని పరిరక్షించి సస్టైనబుల్ భవిష్యత్తుకు మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. అనంతరం జీజీయూ నేషనల్ సన్ యాట్-సెన్ యూనివర్శిటీ(తైవాన్) మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయు)పై సంతకాలు చేసుకుని ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు. కార్యక్రమంలో టీఈసీసీ ఇండియా ప్రతినిధి ప్రెసెసర్ లంగ్- జీహ యాంగ్, జీజీయూ ప్రొ చాన్సలర్ శశికిరణ్ వర్మ, వైస్ ఛాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ పీఎంఎంఎస్ శర్మ, రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

పేపరు ప్రకటన

ఓలేటి వెంకట సత్యనారాయణ S/o లక్ష్మీనారాయణ, కాతేరు, మల్లయ్యపేట డో.నెం.6-4రు అను నేను తెలియపర్చుకొనేది ఏమనగా.

నాకు రాజమహేంద్రవరం రూరల్, కాతేరు గ్రామం. రి.స.నెం.228/1 రు భూమిలో గల లే అవుట్‌లోని ప్లాటు నెం.7.రు చ.గల 234 1/2లు ఖాళీ స్థలము పిడింగొయ్య సబ్ రిజిష్ట్రారు వారి ఆఫీసులో రి.నెం.658/2022 రుగా రిజిష్టరీకాబడిన క్రయ దస్తావేజు రీత్యా నాకు సంక్రమించినది. సదరు స్థలమునకు గల లింకు దస్తావేజు నెం.1888/1998 తేది.4-5-1998 S.R.O. రాజమండ్రిలో జరిగిన క్రయదస్తావేజు, రాజానగరం సబ్‌రిజిష్ట్రారు వారి ఆఫీసు దగ్గర పడిపోయినది. సదరు దస్తావేజు ఎవ్వరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు అందచేయమని కోరుచున్నాను.

ఓలేటి వెంకట సత్యనారాయణ
S/o లక్ష్మీనారాయణ,
డో.నెం.6-4, కాతేరు, మల్లయ్యపేట, సెల్:9849768548


రాజోలు విద్యార్థికి న్యాయం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం మోరంపూడిలోని ఒక ప్రైవేట్ స్కూల్‌లో సహచర విద్యార్థుల దాడిలో గాయపడిన రాజోలు విద్యార్థికి న్యాయం చేయాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ జిల్లా నాయకుడు, న్యాయవాది ఇసుకపట్ల రాంబాబు, జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్, జిల్లా గౌరవాధ్యక్షుడు నక్కా వెంకటరత్నం రాజు అధికారులను కోరారు. ఈమేరకు గురువారం విద్యాశాఖ డీవైఈవో దిలీప్‌కుమార్‌ను కలసి విద్యార్థిపై దాడి ఘటనకు సంబంధించి తీసుకున్న చర్యలపై ఆరా తీశారు.

మీరు జైలు అంటే.. మేం బెయిల్: మాధవ్

రాజమహేంద్రవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): 'ఈ ఏడాది న్నర కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన ఘనకార్యం ఏంటంటే వాళ్లు జైలు అంటే మేం బెయిల్ అంటున్నాం. అభివృద్ధిని, సంక్షేమాన్ని పక్కన పెట్టి జైలు, బెయిల్‌తోనే పుణ్యకాలమంతా గడిచిపోయింది' అని వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండు ఖైదీగా ఉన్న మిథున్‌రెడ్డిని ఆయన భార్య లక్ష్మీ దివ్య, మాధవ్, వైసీపీ మాజీ ఎంపీ శంకర్ నారాయణ గురువారం ములాఖత్ ద్వారా కలిశారు.భార్య లక్ష్మీదివ్య మీడియాతో మాట్లాడకుండా వెళ్లిపోయారు. మాధవ్ మాట్లాడుతూ లాఠీలు, తుపాకీ తూటాలు, పోలీసులు, జైళ్లు, ఎర్రబుక్‌తో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేరన్నారు. ప్రతిపక్షాల గొంతులను నొక్కలేరనేది చరిత్ర చెప్పిన నిజమని అన్నారు.

బొమ్మూరు మాజీ సర్పంచ్ శంభాజీరావు కన్నుమూత



రాజమహేంద్రవరం రూరల్, 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మూరు గ్రామ మాజీ సర్పంచ్ మద్దిపాటి శంభాజీరావు(76) బుధవారం మృతిచెందారు. ఈయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. శంభాజీరావు 24 ఏళ్లు సర్పంచ్‌గా విశిష్ట సేవలందించారు. కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ బీఎస్ రాజు, రాష్ట్ర మంత్రి బత్తిన సుబ్బారావులకు శిష్యుడిగాను, జక్కంపూడి రామ్మోహనరావుకు అనుచరుడిగా ఉంటూ పార్టీలకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి పరిచారు. అనారోగ్య కారణాలతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు.

చాకుతో మహిళపై దాడి

బిక్కవోలు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పందలపాక గ్రామంలో మల్లిపూడి వీర్రాజు.. కానూరి సత్యను చాకుతో దాడి చేసి గాయపర్చాడు. ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ వివరాల ప్రకారం.. సత్య ఇంటి పక్కన వీర్రాజు కోడలు నివాసం ఉంటోందని, ప్రతి రోజు అర్ధరాత్రి వీర్రాజు వచ్చి ఆమె ఇంటి తలుపులు కొడుతూ కేకలు వేస్తుంటాడని, బుధవారం అర్ధరాత్రి వీర్రాజు ఆ ఇంటి తలుపులు కొడుతూ అరుస్తుండడంతో రోజు అర్ధరాత్రి ఇదేమి గొడవ అని సత్య నిలదీయడంతో వీర్రాజు తన దగ్గర వున్న చాకుతో ఆమె ఎడమచాతి పక్కన పొడిచాడు. సత్యకు గాయాలు కావడంతో స్థానికులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు.



ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
జిల్లా వార్తలు

శుక్రవారం 29 ఆగస్టు 2025 | 5

గణపయ్యా..దీవించయ్యా..!

- జిల్లా వ్యాప్తంగా 5 వేల విగ్రహాలు ఏర్పాటు
- వివిధ రూపాల్లో బొజ్జ గణపయ్యలు
- ఘనంగా గణపతి నవరాత్రులు ప్రారంభం



రాజమండ్రిలో బాంబ్ స్క్వాడ్ తనిఖీలు

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమ య్యాయి.ఊరూ వాడా గణపతి నవరాత్రి మండపాలు వెలిశాయి. అడుగు విగ్రహం నుంచీ 15 అడుగుల భారీ గణపయ్య విగ్రహాలు ఆ పందిళ్లలో కొలువుదీరాయి. ఎవరి ఉత్సుకతను బట్టి వారు ఏకదంతుడి విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొన్ని చోట్ల సామూహికంగా పూజలు చేశారు. రూపాయి కాసులు, సిరి ధాన్యాలు, నూలు దారం పోగులు..ఇలా వివిధ రూపాల్లో లంబోదరుడు కనువిందు చేస్తు న్నాడు. నవరా త్రుల అనంతరం విగ్రహాలను నిమజ్జనం చేయకుండా ప్రసాదం రూపంలో భక్తులకు వితరణ చేసే విధంగా పలు రకాల పదా ర్థాలు/వస్తువులతో కొన్ని చోట్ల గణపతి విగ్రహాలను తయారు చేశా రు.జిల్లావ్యాప్తంగా చిన్నాపెద్దా కలిపి 5 వేల వరకూ విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆయా ఉత్సవ కమిటీల నిర్వ హణలో నవరాత్రులు కొనసాగు తున్నాయి.ఈ ఏడాది కూటమి ప్రభుత్వం గణపతి నవరాత్రి మండ పాలకు తొమ్మిది రోజుల పాటు ఉచితంగా కరెంటు సదుపాయం కల్పించడంతో మం డప నిర్వాహకులు, భక్తుల్లో ఆనందం వ్యక్తమైంది.కరెంటు ఉచితం కావ డంతో మరింత ఎక్కువ సంఖ్యలో విద్యుత్ కాంతులను ఏర్పాటు చేశారు. దీంతో గణపయ్య వేడుకల శోభ రెట్టింపయ్యింది. ఇంటింటా పాలవెల్లిని అలంకరించి గణపతిని భక్తి శ్రద్ధలతో పూజించారు. ఉండ్రాళ్లు, కుడుములు, గారెలు, పర మాన్నం తదితర పిండివంటలతో బొజ్జ నిండా నైవేద్యాలు సమర్పించారు. శమంతకో పాఖ్యానం విన్నారు. పూజ అనంతరం తమపై నీలాప నిందలు పడకూడదని లంబోదరుడిని వేడు కొంటూ, తమ కార్యాల్లో విఘ్నాలు తొలగాలని ఆశీర్వదించాలని విఘ్నాధి పతి ని కోరుకుంటూ అక్షతలు తలపై చల్లుకున్నారు. ఈసారి మట్టి గణపతి ప్రతిమలు ఎక్కువగా దర్శనమిచ్చాయి. పర్యావరణ హితులు మట్టి ప్రతిమలకే పూజలు నిర్వహించారు. వినాయక దేవాలయాలు బుధవారం కిటకిటలాడాయి. చెవిలో విన్నవిస్తే కోర్కెలు తీర్చే బిక్కవోలు లక్ష్మీ గణపతి ఆలయంలో భక్తుల కోలాహలం కనిపించింది. ఉదయం ఇంట్లో పూజ చేసుకొని సాయంత్రం



పెరవలి మండలం ముక్కామలలో బుధవారమే గణేశుడి ఊరేగింపు



రాజమండ్రి రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన రూపాయి కాసుల గణపతి

దేవా లయాలకు, అలా విహారానికి వెళ్లే వాళ్లను వర్షం నిరాశ పరిచింది. వర్షం ఓ మోస్తరుగా కురుస్తుండడంతో చాలా మంది ఇళ్లకే పరిమితమయ్యారు. పోలీసులు ప్రత్యేక బందోబస్తుతో పాటు నిఘా ఏర్పాటు చేశారు.అవసరమైన చోట్ల డ్రోన్లతో పహారా కాస్తున్నారు.ప్రతి పోలీస్ స్టేషన్‌లోని సిబ్బంది ఒక్కొక్కరికి ఇన్ని మండ పాలు /పందిళ్లు అంటూ బాధ్యత అప్పగించారు.అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.ఎలాంటి అశ్లీల కార్యక్రమాలు నిర్వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ఉత్సవ కమిటీలే ఉత్సవానికి సంబంధించి పూర్తి బాధ్యత వహించాలని ఎస్పీ నరసింహ కిషోర్ ఇప్పటికే స్పష్టం చేశారు.రాత్రి వేళల్లో మండపాల వద్ద ఉండేవాళ్ల జాబితాలను పోలీసుల తీసుకున్నారు. అధిక శాతం నవరాత్రుల అనంతరం నిజమజ్జనం చేసినా, కొందరు 1, 3, 5 రోజుల్లో కూడా ఈ కార్యక్రమం పూర్తి చేస్తారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా చర్యలు తీసుకున్నామని ఎస్పీ తెలిపారు.

నోటీసులిచ్చినా.. పింఛన్లు ఇస్తాం

అనర్హత నోటీస్ అప్పీల్‌పై నిర్ణయం వచ్చే వరకూ ఎవరికీ ఆపం : కలెక్టర్

రాజమహేంద్రవరం,ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అనర్హుల పేరిట నోటీసులు అందుకున్న వారికి యథావిధిగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. పింఛన్లు రద్దవుతాయనే ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం వారి పరిస్థితిని అర్థం చేసుకుని అప్పీల్ నిర్ణయం తేలే వరకూ పింఛన్లు అందజేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 32 వేల మంది దివ్యాంగులు ఉండగా సుమారు 3211 మందికి అనర్హత నోటీసులు జారీ చేశారు. కోరుకొండ మండలం కోటి గ్రామంలో 600 పింఛన్లు ఉంటే సుమారు 260 వరకూ అనర్హులు ఉన్నట్టు ప్రచారం ఉంది. ఇదిలా ఉండగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ అమరావతి నుంచి గురువారం జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ అనర్హత నోటీసు అందుకున్నవారు ఎంపీడీవో కార్యాలయాల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు.ఇప్పటికే అప్పీల్ చేసుకున్న వారికి తుది నిర్ణయం వచ్చే వరకూ పింఛన్లు యథావిధిగా అందుతాయన్నారు. తాత్కాలిక దివ్యాంగ సర్టిఫికెట్లు ఉన్నవారికి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. నోటీసు అందుకుని ఇప్పటి వరకూ అప్పీలు చేయని వారు ఎంపీడీలకు అప్పీల్ చేసుకోవాలని సూచించారు.

భూగర్భ జలాల పునరుద్ధరణ చర్యలు

జిల్లాలో భూగర్భజలాల పునరుద్ధరణకు పైకప్పు వర్షపు నీటి సేకరణ వ్యవస్థలు, చెరువుల పునరుద్ధరణ, చెక్‌డ్యామ్‌లు, రీచార్జి పిట్‌లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ప్రశాంతి అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేయాలని, పీఎం కుసుమ్ పథకంలో 10 మెగావాట్ల సామర్థ్యంగల సౌర విద్యుత్ ప్లాంట్లకు అవసరమైన భూమిని గుర్తించాల న్నారు.కార్యక్రమంలో జేసీ ఎస్.చిన్నరాముడు, డీఆర్వో సీతారామమూర్తి, సీపీవో అప్పలకొండ, డ్వామా పీడీ నాగ మల్లే శ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు, డీఆర్‌డీఏ పీడీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చవితి రోజంతా కురిసింది వాన

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో ఓ మోస్తరుగా వర్షం పడింది. బుధవారం రాత్రంతా వాన కురిసింది.గురువారం ఉదయం తెరపి ఛ్చింది. మళ్లీ రాత్రి వాన జోరు మొదలైంది. గత 24 గంటల్లో జిల్లాలో నమోదైన వర్షపాతం వివరాలను అధికారులు ప్రకటిం చారు. రాజమండ్రి అర్బన్‌లో అత్యధికంగా 61.2 మిల్లీ మీటర్లు, గోపాలపురంలో 60. 6 మి.మీ, రాజమండ్రి రూరల్‌లో 54.2 ,పెరవలిలో 43.6, నల్లజర్లలో 42, తాళ్లపూ డిలో 37.2, నిడదవోలులో 36 మి.మీ వర్షపాతం నమోదైంది. గోకవరంలో తక్కువగా 8.88, కొవ్వూరు 9.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో మొత్తం 553 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు అంచనా వేశారు. గురువారం రాత్రి 8గంటల తర్వాత రాజమండ్రిలో భారీ వాన కురిసింది. జిల్లాలో పలు చోట్ల అధికంగాగానే వర్షం పడినట్టు చెబుతున్నారు.పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి.గోదావరి వరద కూడ పెరుగుతోంది.

బస్..రష్!



స్త్రీ శక్తి చూపుతున్న మహిళలు



రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : స్త్రీ శక్తి - మహిళల ఉచిత ఆర్టీసీ ప్రయాణ పథకం అమల్లో తూర్పుగోదావరి జిల్లా రికార్డులు సృష్టిస్తోంది. కేవలం పది రోజుల్లోనే 6.5 లక్షల మంది స్త్రీలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సాగించారు. తద్వారా రూ.2 కోట్ల 25 లక్షలకు పైగా ఆర్థిక ప్రయోజనం పొందారు. ఈ నెల 25వ తేదీ సోమవారం ఒక్కరోజే రూ.25 లక్షల 16 వేలు లబ్ధిపొందడం గమనార్హం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 15వ తేదీన ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించినా 16వ తేదీ నుంచి మహిళల రద్దీ పెరిగింది. అప్పటి నుంచి నేటి వరకూ రోజు రోజుకూ మహిళా ప్రయాణీకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. మొన్న ఆదివారం ఒక్కరోజే లక్ష మంది రాకపోకలు సాగిస్తే, సోమవారం లక్షా 20 వేల మంది ప్రయాణించారు.పది రోజుల్లో బస్సుల్లో ఆక్యుపెన్సీ 65 శాతానికి చేరుకుందని, మహిళల ఓఆర్ 54 శాతానికి పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

దూరప్రాంతాల జర్నీ ఇలా..

విశాఖపట్నం, విజయవాడ వెళ్లాలంటే అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. కానీ ఈ సర్వీసుల్లో స్త్రీలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత ప్రయాణం అనుమతించరు దీంతో ఉచిత ప్రయాణానికి కొత్త మార్గాలను అనుసరిస్తున్నట్టు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. విజయవాడ వెళ్లేవాళ్ల ఏలూరు వరకూ ఎక్స్‌ప్రెస్, అల్ట్రా పల్లెవెలుగు, పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించి అక్కడి నుంచి విజయవాడ వెళ్లిపోతున్నారు. విశాఖపట్నం వెళ్లే వాళ్లు కూడా తుని వరకూ ఫ్రీ బస్సెక్కి అక్కడి నుంచి అనకాపల్లి వెళుతున్నారు. అనకాపల్లి నుంచి విశాఖపట్నం వెళ్లడానికి చాలా ఫ్రీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. రాజమహేంద్రవరం - తుని రూటులో రద్దీ బాగా పెరగడంతో అదనంగా రెండు బస్సులు పెంచారు. ప్రస్తుతం ఈ రూటులో రాజమహేంద్రవరం డిపోకు చెందిన 16 బస్సులు, తుని డిపో బస్సులు 14 బస్సులు తిరుగుతున్నాయి. అదేవిధంగా రాజమహేంద్రవరం - కాకినాడ వయా బిక్కవోలు, రాజానగరం ఈ రెండు రూట్లలోనూ రష్ పెరిగింది. ఈ కారణంగా రాజమహేంద్రవరం-కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసుల్లో ప్రయాణీకుల సంఖ్య తగ్గినట్టు కనిపిస్తోందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

- హ్యాప్రీగా సాగిపోతున్న ప్రయాణం
- 6.5 లక్షల మంది ఉచిత ప్రయాణం
- పెరిగిన మహిళల ఆక్యుపెన్సీ
- రూ.2 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం
- తుని, కాకినాడ రూట్లలో పెరిగిన రద్దీ
- అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు
- విజయవాడ,విశాఖకు బ్రేక్ జర్నీ
- కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులు ఖాళీ

హ్యాపీగా ఫీలవుతున్నారు

ఉచిత బస్సు పథకాన్ని మహిళలు హ్యాపీగా భావిస్తున్నారు.పథకం ప్రారంభమైన 15వ తేదీ నుంచి ఇప్పటి వరకూ బస్సుల్లో మొత్తం 12 లక్షల మందికి పైగా ప్రయాణీకులు రాకపోకలు సాగించగా వీరిలో 6 లక్షల 50 వేల మంది వరకూ మహిళలే. కేవలం పది రోజుల్లో మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్ల ఆక్యుపెన్సీ 54 శాతానికి పెరిగింది. భద్రాచలం, వాడపల్లి రూట్లలోనూ ఉచిత ప్రయాణం ఇచ్చేయడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఆర్టీసీ దగ్గర ఉన్న బస్సులన్నీ ఆన్ రోడ్ చేశాం.

- వైఎస్ఎన్ మూర్తి, ఆర్టీసీ జిల్లా ప్రజారవాణా అధికారి

కండక్టర్ నోట కొత్త మాట



దివాన్‌చెరువు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : టిక్కెట్.. టిక్కెట్.. అందరూ టిక్కెట్లు తీసుకున్నారా... అనే మాటలు ఆర్టీసీ బస్సుల్లో సాధారణంగా కండక్టర్‌ల నోట నిన్న మొన్నటి వరకూ సాధారణంగా వినిపిస్తూ ఉండేవి.అయితే గత కొద్ది రోజులుగా దీనికి తోడు అమ్మా ఆధార్.. ఆధార్.. ఆధార్ కార్డు ఉందా అనేమాటలు వినిపిస్తున్నాయి.గతంలో కూడా సీనియర్ సిటిజన్లకు రాయితీ కోసం ఆధార్ కార్డు అడిగినప్పటికీ అది ఆయా బస్సుల్లో కొద్ది మంది ప్రయాణికులకే పరిమితం అయ్యేది. అయితే ప్రభుత్వం మహిళలకు స్త్రీ శక్తి పథకం క్రింద పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు,సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు ఈ నెల 15వ తేదీ నుంచి అవకాశం కల్పించింది. మన రాష్ట్రంలో నివసిస్తున్న మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు వర్తిస్తుంది. ఈవిధంగా ఉచిత ప్రయాణ సౌకర్యం వినియోగించుకునేందుకు మహిళా ప్రయాణీకులు ఏదో ఒక గుర్తింపుకార్డు చూపించాల్సి ఉంటుంది. అయితే మహిళలంతా ఆధార్‌కార్డు చూపిస్తున్నారు.. కండక్టర్లు టిక్కెట్లు ఇస్తున్నారు. వాటిపై సంబంధిత ప్రయాణికులు ఎక్కడి నుంచి ఎక్కడవరకూ ప్రయాణిస్తున్నారో చూపి వారు చెల్లించే టిక్కెట్ సొమ్ము వద్ద సున్నా ఫేర్ చూపుతున్నారు. ఉచిత ప్రయాణం చేసే మహిళల్లో ఎక్కువ మంది ఆధార్ కార్డులు పైనే తమప్రయాణాలు సాగిస్తుండడంతో కండక్టర్లు బస్‌లలో టిక్కెట్ ఇచ్చేందుకు వీటిని అడుగుతున్నారు. దీనితో కొంతమంది మహిళలు ఆనందంగా తమ ఆధార్ కార్డులు చూపుతూ స్త్రీశక్తి అని చలోక్తులు విసురుతున్నారు.అలాగే గతంలో బస్సులలో కొన్ని సీట్లు మాత్రమే మహిళలకు కేటాయించేవారు.ఈ ఉచితప్రయాణసౌకర్యం వచ్చాక మహిళాప్రయాణీకులు రద్దీ బస్సులలో పెరగడంతో బస్సుల్లో ఎక్కువ సీట్లులో వారే కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇక టిక్కెట్లకు సొమ్ము చెల్లించిన పురుషప్రయాణీకులు నిల్చుని ప్రయాణాలు చేస్తున్నారు.

పెరుగుతున్న గోదారి 8

చేబ్రోలులో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన
వట్లూరుకు అభ్యర్థులు 7

అంగన్‌వాడీల ఆందోళన విరమణ



కొవ్వూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు ఆన్‌లైన్ వర్కుకి హాజరవుతున్నట్టు అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.మాణిక్యాంబ తెలిపారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్లు ఆగస్టు 4వ తేదీన ఐసీడీఎస్ పీవోలకు ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు ఇచ్చేసి ఆన్‌లైన్ వర్క్‌ని నిలుపుదల చేశారు.ఇదిలా ఉండగా రాష్ట్ర అధికారులతో యూనియన్ నాయకుల సమావేశమయ్యారు. సమస్యలు పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇవ్వడంతో బుధవారం నుంచి ఫోన్‌లు తీసుకుని ఆన్‌లైన్ వర్కుకి హాజరవుతున్నారు. రాష్ట్రంలో 4687 మినీవర్కర్స్‌ని మెయిన్ సెంటర్లకు మార్చి వారికి రూ. 11,500ల వేతనం ఇవ్వడానికి, మినీ సెంటర్‌లలో క్రొత్తగా హెల్పర్స్‌ని నియమించడానికి, అంగన్వాడీలకు పెన్షన్ పంపిణీ నిలుపుదల చేస్తూ సర్క్యులర్ ఇచ్చారన్నారు. గ్రాట్యూటీ జీవో మార్పుచేయాలనే ప్రతిపాదనకు 1972 గ్రాట్యుటీ అమలుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. హెల్పర్స్ ప్రమోషన్స్‌కి సంబంధించి వారంలో గైడ్‌లైన్స్ అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. నెల రోజుల్లో 5జి కొత్త ఫోన్లు అందజేస్తామన్నారు. అంగన్వాడీలకు వేతనాల పెంపుదల, సంక్షేమ పథకాలు అమలు వంటి ప్రభుత్వ హామీలను అమలు చేయకుంటే మరో పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు ఎం.సుందరబాబు, ఎస్.శాంత కుమారి,బి.శ్రీదేవి, బి.రమాదేవి, సిహెచ్‌వి బ్రహ్మమ్మ, సీతారత్నం, చైతన్య, గనెమ్మ పాల్గొన్నారు.

మెత్ డ్రగ్ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన బొమ్మూరు పోలీసులు.. మెత్ డ్రగ్‌ని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజులపాటి అంకారావు తెలిపిన వివరాల ప్రకారం.. హుకుంపేట జంక్షను సమీపంలోని కుంభకోణం కాఫీ షాపు సమీపంలో నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నారనే సమాచారం వచ్చింది. ఎస్ఐ అంకారావు తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. హుకుంపేటకు చెందిన అమన్ పాండే, విశాఖపట్నానికి చెందిన మండపాటి తేజశ్వి వర్మను అదుపులోకి తీసుకున్నారు. వాళ్ల వద్ద ఉన్న రూ.90 వేలు విలువ చేసే 18గ్రాముల మెత్ డ్రగ్ (క్రిస్టల్ పౌడర్ రూపంలో ఉన్న నిషేధిత మత్తు మందు), రూ.1.07 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలి : సీఐటీయూ


అల్లూరి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కొవ్వూరు,ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు తగ్గిస్తామని చెప్పి ప్రజలను మోసం చేసిందని, అందువల్ల పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.సుందరబాబు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని అల్లూరి సీతారామరాజు సెంటర్‌లో 2000 ఆగస్టు 28వ తేదీన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో బషీర్‌బాగ్‌లో విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా జరిగిన ప్రదర్శనలో అసువులు బాసిన అమరవీరులు రామకృష్ణ, విష్ణువర్ధన్, రెడ్డి బాలస్వామి 25వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి, మీకు అండగా ఉంటామని చెప్పి, అధికారంలోకి వచ్చి 14 నెలల కాలంలో సర్దుబాటు చార్జీల రూపంలో ప్రజలపై రూ.15,485 కోట్లు అదనపు భారం మోపారన్నారు. 2019-24 మధ్య కాలంలో వినియోగించుకున్న విద్యుత్‌కు మరో రూ. 12,717 కోట్లు ట్రూఅప్ చార్జీలు వేయడానికి రంగం సిద్ధం చేశారన్నారు. విద్యుత్ సుంకాన్ని యూనిట్‌కు ఆరు పైసల నుంచి రూపాయికి పెంచుతూ చట్టబద్దత కల్పించిందని, స్మార్ట్ మీటర్లతో స్మార్ట్‌గా దోపిడీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు దగ్గు అశోక్, పడాల గంగాధరరావు, కే.వీరబాబు, వై.ఈశ్వరరావు, పి.జగన్నాథం, అప్పలనాయుడు, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

గృహాలకు స్మార్ట్‌మీటర్లు బిగించొద్దు


సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేస్తున్న నాయకులు

దేవరపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యమ అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ ఉద్యమానికి ప్రజలు సిద్ధం కావాలని సీపీఎం కార్యదర్శి ఎస్.భగత్ పిలుపునిచ్చారు. దేవరపల్లి బస్టాండ్ వద్ద గురువారం విద్యుత్ అమరవీరుల ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వాములకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా భగత్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన విద్యుత్ ఉద్యమం నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. నాటి విద్యుత్ ఉద్యమం పదిసంవత్సరాల పాటు విద్యుత్ ఛార్జీలు పాలకులు పెంచకుండా, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోగలి గిందన్నారు. స్మార్ట్‌మీటర్లు బిగించటం ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయాలని ప్రభుత్వాలు చూస్తున్నాయని, అదానీ స్మార్ట్‌మీటర్ల బిగింపును తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రత్నాజీ, ఉండవల్లి కృష్ణారావు, అయినపర్తి శ్రీనివాస్, అడపా సూర్యారావు, ఆచంట సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్‌పై 1న ఛలో విజయవాడ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని కోరుతూ సెప్టెంబరు 1న ఛలో విజయవాడ కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఏపీసీపీఎస్‌ఈఏ సభ్యుడు బారణాల శంకర్ పిలుపునిచ్చారు. గురువారం వేగేశ్వరపురం ఉన్నత పాఠశాలలో దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ఇప్పటి వరకూ నెరవేర్చలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తమ సమస్యపై దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటరమణ, రాము, తదితర సంస్థ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పెరవలిలో ఏకాదశ సహస్ర గలార్చన

పెరవలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈనెల 29న మాతృభాషా పరిరక్షణ సేవా సమితి నిర్వహణలో 108 ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల భాగస్వామ్యంతో ఏకాదశ సహస్ర గలార్చన తెలుగు బాల శతకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా వినాయక చవితి పూజలు


గోపాలపురంలో వినాయకుడిని పూజిస్తున్న మహిళలు


చాగల్లు తెలగ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహం

గోపాలపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రోజూ ఉదయం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం స్వామివారిని గోదావరిలో నిమజ్జనం చేయనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పెరవలి: వినాయక చవితి సందర్భంగా ఆయా గ్రామాల్లోని మండపాలను విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. కానూరు, నడిపల్లి, తీపర్రు, కాకరపర్రు, అజ్జరం, పెరవలి, కాపవరం, కొత్తపల్లి, నల్లాకులవారి పాలెం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, తదితర గ్రామాల్లో పూజలు జరిగాయి.

చాగల్లు: మండలంలో గణపతి నవరాత్రులు బుధవారం వేడుకగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రమైన చాగల్లులో తెలగ సంఘం , వర్తక సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. అలాగే తెలగ సంఘం కళావేదికపై ఏర్పాటు చేసిన హరికథ కాలక్షేపం, భరత నాట్యం, కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వర్తకసంఘం కళావేదికపైన నిర్వహించిన భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యాలు, హరికథ ఆకట్టుకున్నాయి. ఆయా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంద్రోతు సురేంద్ర కుమార్, గ్రంధి రాంబాబు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నల్లజర్ల: మండలంలో వినాయక చవితి వేడుకలను బుధవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. నల్లజర్లలో వినాయకుడి గుడి వద్ద అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వాహన పూజలు చేశారు. అలాగే చీపురుగూడెంలో వరసిద్ధి వినాయకుడి గుడి వద్ద వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రకాశరావుపాలెంలో గురువారం వినాయకుడ్ని తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్చుతూ ఊరేగించి నిమజ్జం చేశారు.

ప్రశాంత జీవితమే 'ఆశ్రయ' లక్ష్యం


మాట్లాడుతున్న ఫౌండేషన్ నిర్వాహకులు


కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జీవితం చరమాంకంలో ఉన్న రోగులకు తోడున్నామని భరోసా కల్పించి, వారికి ప్రశాంత జీవితాన్ని అందించడమే ఆశ్రయ ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ నిర్వాహకులు మధిర విజయ్‌కుమార్, పల్లవి తెలిపారు. గురువారం కొవ్వూరు, నందమూరు రోడ్‌లో ఉన్న ఆశ్రయ ఫౌండేషన్‌లో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ క్యాన్సర్ వంటి తీవ్ర అనారోగ్యాలతో పోరాడుతూ వైద్యపరంగా ఏమిచేయలేమని నిర్ధారించిన రోగులకు భరోసా కల్పించి వైద్యం అందజేస్తున్నామన్నారు. అంతేకాకుండా గుండె, నరాలకు సంబంధించి పలు వ్యాధులతో బాధపడే వారికి నామ మాత్ర రుసుముతో నిపుణులైన బృందంతో సేవలు అందించడం జరుగుతుందన్నారు. గత ఆరు సంవత్సరాలుగా 1500 పేషెంట్లకు సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో ఉప్పులూరి రామకృష్ణ పాల్గొన్నారు.

పారదర్శకంగా మెగా డీఎస్సీ

• ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం కూటమిప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో పారదర్శకంగా మెగా డీఎస్సీని నిర్వహించిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మెగా డీఎస్సీ నిర్వహించి యువ ఉపాధ్యాయులతో విద్యారంగాన్ని దేశంలో తొలిస్థానంలో నిలబెడతామన్నారు. యువత బాగుపడడం ఇష్టం లేని జగన్మోహనరెడ్డి మెగా డీఎస్సీని ఆపడానికి 24 కేసులు వేయించాడన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు గత 14 నెలలుగా సంస్కరణలు అమలుచేస్తూ మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ బడులకు వెలుగులు తీసుకువస్తున్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు 14 ఏళ్లలో 13 డీఎస్సీలు నిర్వహించి 1,80,208 పోస్టులు భర్తీచేసి చరిత్ర సృష్టించారన్నారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ తీస్తానని చెప్పి జగన్మోహనరెడ్డి నిరుద్యోగులను మోసం చేశాడన్నారు. టెట్, డీఎస్సీ కలిపి నోటిఫికేషన్ ఇచ్చి అభ్యర్థులను గందరగోళానికి గురిచేశాడన్నారు. 2013లో రద్దుచేసిన అప్రెంటీస్ విధానాన్ని జగన్‌రెడ్డి పునరుద్ధరించాడని, డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లకు రెండేళ్లపాటు పేస్కేలు అమలు చేయకుండా గౌరవ వేతనంతో సరిపెట్టిన దగాకోరన్నారు. పీఆర్సీ సాధన కోసం ఉద్యమించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించాడన్నారు. గురువులను మద్యం దుకాణాల ముందు కాపలా పెట్టించాడన్నారు. ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచి ఇబ్బందులకు గురిచేశాడన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో 729 నాన్ టీచింగ్ పోసులు, 90 మంది ఎస్టీ యువతకు ఉపాధ్యాయులుగా నియమించడం జరిగిందన్నారు. 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ, జూనియర్ కళాశాలల్లో 700 మంది సిబ్బంది పునరుద్ధరణ, 476 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 3619 కాంట్రాక్టు లెక్చరర్‌ల పునరుద్ధరణ, టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు కూటమి ప్రభుత్వం ఆరురకాలు ఉన్న బడులను తొమ్మిది రకాలుగా మార్పు చేసిందన్నారు. అంతేకాకుండా రానున్న రోజుల్లో మరిన్ని డీఎస్సీలు నిర్వహిస్తామన్నారు. యువత అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

సీఎంను కలిసిన జవహర్


సీఎంను కలిసిన మాజీమంత్రి జవహర్

కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని గురువారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిలో భాగంగా కమిషన్‌కు సంబంధించి పలు అంశాలపై చర్చించి, ఏవిధంగా ముందుకు వెళ్లాలో సలహా కోరడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ కమిషన్‌కు వచ్చినటువంటి ఫిర్యాదులు ఆధారంగా ఏజన్సీ ఏరియాలోని దళితులకు సంక్షేమ కార్యక్రమాలు, విద్య, ఆరోగ్యానికి సంబంధించిన అంశాలు రావడం లేదని, దానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేయాలని కోరడం జరిగిందన్నారు. లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ద్వారా చర్మకార వృత్తిపై ఆధారపడిన నిరుద్యోగ యువతకు సెంట్రల్ ఫుట్‌వేర్ ఇండస్ట్రీస్ నుంచి ట్రైనింగ్ తీసుకుని స్కిల్ డెవలప్‌మెంటు అభివృద్ధి చేసి, వారందరికీ స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ అందించాలని కోరడం జరిగిందన్నారు. రాష్ట్రంలో దళితులు అట్రాసిటీ విషయంలో గానీ, లాండ్ విషయంలో ఉన్న సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాలని కోరడం జరిగిందని జవహర్ తెలిపారు.

విద్యార్థికి ఆర్థిక సాయం అందజేత


సాయాన్ని అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మణరావు, తదితరులు

కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థి చదువుకు చిడిపి గ్రామ సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు గురువారం ఆర్థిక సాయాన్ని అందజేశారు. లక్ష్మణరావు పుట్టిన రోజును పురస్కరించుకుని పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి చెందిన బీకాం చదువుతున్న విద్యార్థిని మద్దినాల రోషి చదువు నిమిత్తం తల్లి వెంకటలక్ష్మికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగుల బంధువులకు సత్యసాయి అన్నదాన పథకంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు పి. జయరాజు, యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, గోలి వెంకటరత్నం, నాయకులు కవల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



పోటీలకు ఎంపికైన సమిశ్రగూడెం విద్యార్థులు

నిడదవోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సమిశ్రగూడెం జడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.జిలానీ తెలిపారు. 10వ తరగతి చదువుతున్న మంగం సిగ్గా, 8వ తరగతి చదువుతున్న తొర్లపాటి యశ్వంత్ కుమార్, 9వ తరగతి చదువుతున్న జగదీష్, మురాల సతీష్ ఉన్నారన్నారు. వీరంతా ఈ నెల 29వ తేదీ నుంచి ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం కే.జిలానీ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్టు


రావిమెట్లలో అరెస్టు చేసిన వ్యక్తులతో పోలీసులు

నిడదవోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రావిమెట్ల శివారులో బుధవారం కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు సమిశ్ర గూడెం ఎస్సై బాలాజీ సుందరరావు తన సిబ్బందితో వెళ్లి దాడి చేయగా, ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి మూడు కోళ్లు, రూ. 10,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

14న హిందూ న్యాయవాదుల ధర్మ సమ్మేళనం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపుల నివారణకు కార్యాచరణ రూపొందించుటకుగాను వచ్చేనెల 14 వ తేదీన న్యాయవాదుల ధర్మ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు శ్రీసైవ క్షేత్ర పీఠాధిపతులు, ధర్మోరక్షితి రక్షితః ట్రస్టు వ్యవస్థాపకుడు పూజ్యశ్రీ శివ స్వామిజీ పేర్కొన్నారు. విజయవాడ తుమ్మలపల్లి క్షేత్ర య్య కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమానికి కొవ్వూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులను ఆహ్వానించడానికి గురువారం స్వామీజీ విచ్చేశారు. న్యాయవాది చామర్తి నాగకుమార్ ఇంటి వద్ద పలువురు న్యాయవాదులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వామీ జీ మాట్లాడుతూ దేవాలయాలు, వాటి ఆస్తులను రక్షించుకునేందుకు న్యాయం, ధర్మం ప్రకారం ప్రయత్నం చేద్దామన్నారు. స్వామిజీలు, హిందూ సంఘాలు, హిందూ కార్యకర్తలపై అక్రమ కేసులు, వేధింపులపై న్యాయవాదుల సలహాలు, సూచనలు, నివారణ చర్యలపై చర్చా, కార్యాచరణ రూపొందించుటకు న్యాయవాదుల ధర్మ సమేళనం నిర్వహించడం జరుగుతుందన్నారు. అంతకు ముందు గౌతమీనగర్‌లోని పురుషోత్తమ రామమందిరం సమీపంలో ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద కళాశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కొవ్వూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వర్రే నాగ మురళీకృష్ణ, న్యాయవాదులు టీవీఎస్ రమణమూర్తి, చామర్తి నాగకుమార్, కోడూరి ఆంజనేయులు, జీ.రాజా, వి.సాయి కృష్ణకుమార్, వీఆర్‌వీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కలుపుమందు తాగి ఒకరి మృతి

కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక కలుపుమందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందినట్లు కొవ్వూరురూరల్ ఎస్ఐ కే.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన దున్నా సర్వారాయుడు (53) అప్పుల బాధ తాళలేక ఈనెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటివద్ద కలుపుమందు తాగాడు. చికిత్స నిమిత్తం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు దున్నా శివాజీ అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ కే.శ్రీహరిరావు తెలిపారు.

గోదావరి పుష్కరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి

కొవ్వూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు ఇప్పటి నుంచే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొవ్వూరు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, టేబుల్ అజెండా సమావేశాలను మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2027లో పుష్కరాలు వస్తున్నాయని దేశ, విదేశాల నుంచి యాత్రికులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. యాత్రికులు రద్దీ అంతా రాజమహేంద్రవరంపై పడకుండా కొవ్వూరు మళ్లించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అధికారులు శాఖలవారీగా ఎస్టీమేట్లు తయారుచేసి అందజేయాలన్నారు. దీనిపై త్వరలో రివ్యూ మీటింగ్ ఏర్పాటుచేస్తామన్నారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. చైర్‌పర్సన్ రత్నకుమారి మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు చేపట్టామని, 23 వార్డుల వారీగా ప్రణాళిక తయారుచేసి గ్యాంగ్‌వర్కు చేపడుతున్నామన్నారు. తర్వాత కంటమణి రమేష్‌బాబు మాట్లాడుతూ పట్టణంలోని 18వ వార్డు, ఇందిరమ్మకాలనీ, 22వ వార్డులలో చాలా రహదారులు గుంతలు పడి ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. బీజేపీ కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ మాట్లాడుతూ గోష్పాదక్షేత్రం సుందరీకరణ పార్క్ నిర్వహణకు కార్మికులను ఏర్పాటుచేయాలన్నారు. పట్టణంలోని లేఅవుట్‌లలో ఓపెన్ సైట్‌లను దాతల సహకారంతో చెట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలన్నా రు. టీడీపీ ఫ్లోర్ లీడర్ సూరపనేని చిన్ని మాట్లాడుతూ పట్టణంలో డ్వాక్రా మహిళా సంఘాల ఆధ్వర్యంలో పార్కుల అభివృద్ధికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశామన్నారు. అనంతరం పాలూరి నీలిమ, కండెల్లి రామారావు మాట్లాడారు.

గౌరవించుకోవడం మంచి పరిణామం

కొవ్వూరు పురపాలక సంఘంలో 1968 నుంచి ఇప్పటివరకు చైర్మన్‌లుగా పనిచేసిన వారి ఫొటోలను కౌన్సిల్ హాలులో ఏర్పాటుచేశారు. వాటిని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆవిష్కరించారు. అనంతరం మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లు పసలపూడి రామమూర్తి, బోడపాటి ముత్యాలరావు, కొల్లి రమేష్, పోలిపర్తి సత్యవతి, సూరపనేని చిన్నిలను శాలువాలు కప్పి సత్కరించారు. వైస్ ఛైర్మన్ మన్నె పద్మ మాట్లాడుతూ మాజీ మున్సిపల్ ఛైర్మన్‌లను గౌరవించుకోవడం మంచి పరిణామమని, అయితే వారి పిలుపే గౌరవంగా లేదని ఆవేదన వ్యక్త పరిచారు. రుత్తల బాస్కరరావు మాట్లాడుతూ ము న్సిపాల్టీలో మూడు సార్లు ఛైర్మన్‌గా, ఎంఎల్‌సీగాపనిచేసిన కోడూరి శివరామకృష్ణను గుమస్తాతో ఫోన్‌చేసి పిలవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, చైర్‌పర్సన్ బావన రత్నకుమారీలు 1968 నుంచి ఇప్పటివరకు కోడూరి శివరామకృష్ణ మున్సిపాల్టీలో ఛైర్మన్‌గా, ఫ్లోర్‌లీడర్‌గా పనిచేయడం అభినందనీయమన్నారు. అధికారులు ప్రోటోకాల్ పాటించాలన్నారు. వ్యక్తిగతంగా కలిసి ఇటువంటి సంఘటనలు మరలా పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పుకోవాలన్నారు.

మేరీమాత పుణ్యక్షేత్రాన్ని..

దర్శించటం ఎంతో అదృష్టం


• వాటికన్ సిటీ పోప్‌కు అత్యంత సన్నిహితుడు • సలహాదారుడు కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్


గౌరీపట్నంలో భక్తుల విశ్రాంతి గృహసముదాయాన్ని ప్రారంభిస్తున్న కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్

దేవరపల్లి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వాటికన్ సిటీ పోప్‌కు అత్యంత సన్నిహితుడు, సలహాదారుడు కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్ గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రాన్ని దర్శించటం ఎంతో అదృష్టమని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పేర్కొన్నారు. గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత పుణ్యక్షేత్రంలో నూతనంగా నిర్మించిన భక్తుల విశ్రాంతి గృహ సముదాయాన్ని కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్, ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ప్రారంభించారు. ముందుగా పీఠాధిపతులకు నిర్మలగిరి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ స్వాగతం పలికారు. మేరీమాత మందిరం వద్ద ప్రధాన ఆలయంలోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో కార్డినల్ ఓస్వాల్డ్ గ్రేషియస్ మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రం ఆధ్యాత్మికంగానూ, పర్యాటక కేంద్రంగానూ ఎంతో సుందరంగా ఉందన్నారు. ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడుతూ నిర్మలగిరి పుణ్యక్షేత్రం దినదినాభివృద్ధి చెందుతూ ఎంతోమంది భక్తులు ఈ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకుం టున్నారని ఆయన పేర్కొన్నారు. అనంతరం జయరావు పుట్టినరోజు సందర్భంగా కేకును కట్ చేశారు. కార్యక్రమంలో సుప్రీంకోర్టు లాయర్ శ్రీసభ, న్యాయ సలహాదారు జ్యాకిము రేయిస్, ఫాదర్ బాల, పాదర్ ఇమ్మాన్యుయేలు, పౌలురాజు, పాదర్ దివాకర్, పాదర్ , జోజి, నిత్యఅన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్నక్యాంటీన్లు

• గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు


గోపాలపురంలో భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, తదితరులు

గోపాలపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పేదలకు మూడుపూటలా కడుపునిండా అన్నం పెట్టి ఆకలి తీర్చడానికే సీఎం చంద్రబాబు అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన గోపాలపురంలో రూ. 61 లక్షలతో నిర్మించతలపెట్టిన అన్నక్యాంటీన్‌కు బుధవారం భూమి పూజచేశారు. అనంతరం ఇటీవల ప్రభు త్వం ప్రవేశపెట్టిన స్మార్ట్‌కార్డులను, సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమంతో పాటు పేదలకు కూడు, గూడు ఏర్పాటు చేయాలనే సదుద్దేశంతో సీఎం రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా అన్నక్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రమూర్తి, నియోజకవర్గ అధ్యక్షురాలు కాకర్ల రామ తులసి, ఏఎంసీ ఛైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్ బాబు, గోపాలపురం, చెరుకుమిల్లి సొసైటీ ఛైర్మన్‌లు వడ్లమూడి రమేశ్, గద్దే హరిబాబు, సమన్వయ కమిటీ సభ్యులు వేముల నాగరాజు, టీడీపీ నాయకులు ముత్యాల రాయుడు, కాకర్ల జగదీశ్, నంద మూరి సత్యనారాయణ, నూతంగి దొరబాబు, ఎంపీడీవో రాజమనోహర్, తహశీల్దార్ సాయిప్రసాద్, సీఎస్ డీటీ దివాకర్, జ్యేష్ట శ్రీధర్ పాల్గొన్నారు.

మళ్లీ ఉధృతంగా గోదావరి

ధవళేశ్వరం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల క్రింత ఉప్పొంగి ప్రవహించి ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటిన గోదావరి మళ్లీ ఉధృతమవుతోంది. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి నుంచి వరద ప్రవాహం గోదావరిలో కలుస్తూ ఉండటంతో ధవళేశ్వరం వద్ద వరద పెరుగుతోంది. దీంతో కాటన్ బ్యారేజ్ మొత్తం గేట్లను 1.5 మీటర్ల మేర పైకి ఎత్తి 5,15,938 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలివేస్తూ గోదావరి బేసిన్‌ను ఖాళీ చేస్తున్నారు. దీంతో ధవళేశ్వరం వద్ద గురువారం సాయంత్రానికి నీటిమట్టం 10.40 అడుగులగా నమోదయ్యింది. ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని అంచనా వేస్తూ శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుంటుందని అధికారులు అంచనా. ఎగువున భద్రాచలం వద్ద క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం గురువారం సాయంత్రానికి 38.60 అడుగులకు చేరుకుంది.